


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 292 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం శుక్రవారం 28 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 292 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM FRI 28 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# మంగళగిరిలో మోడరన్ రైతు బజార్.. శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్

- రూ.18.55 కోట్ల వ్యయంతో 5.90 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణం
- అరబిందో ఫార్మా ట్రస్ట్ సీఎస్ఆర్ నిధులతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం
- రిటైల్, హోల్ సేల్ స్టాళ్లు, కోల్డ్ స్టోరేజీతో కూడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్
- మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా ఈ నిర్మాణం



పెన్ పవర్ డెస్క్:మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరో కీలక ముందడుగు వేశారు. మంగళగిరి పట్టణంలోని నిడమర్రు రైల్వే గేట్ సమీపంలో రూ. 18.55 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక 'మోడరన్ రైతు బజార్' నిర్మాణ పనులకు ఆయన గురువారం భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. సుమారు 5.90 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించనున్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందిస్తోంది. స్థానిక ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఈ రిటైల్, హోల్ సేల్ కూరగాయల మార్కెట్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ శ్రీకారం చుట్టారు. మొత్తం 71,925 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇందులో రిటైల్ మార్కెట్ విభాగంలో కూరగాయల విక్రయాల కోసం 102 స్టాళ్లు, పండ్లు, పూల కోసం 54 స్టాళ్లను కేటాయించారు. అలాగే, హోల్ సేల్ మార్కెట్ విభాగంలో 23 దుకాణాలు, 18 అన్‌లోడింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు కోల్డ్ స్టోరేజీ, కూరగాయలు ప్రక్షాళన కేంద్రాలు, క్యాంటీన్, వాహనాల పార్కింగ్ వంటి అత్యాధునిక సదుపాయాలను ఇక్కడ కల్పించనున్నారు.

శంకుస్థాపన కార్యక్రమం నిమిత్తం విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మార్కెట్ నమూనాను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక టీడీపీ ముఖ్య నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.




## రాజకీయాల్లోకి జెన్ జీ.. ఇగో వీడి యువతను కలుపుకుపోవాలి:

- ప్రామాణికత, భాగస్వామ్యం కోరుకుంటున్న జెన్ జీ యువత
- ఇగోను పక్కనపెట్టి యువతను భాగస్వామ్యం చేయాలన్న లోకేశ్
- నియోజకవర్గాల్లో యువత, ఇన్‌ఫ్లుయెన్సర్లతో చర్చిస్తామని వెల్లడి
- యువత నుంచి అద్భుతమైన ఆలోచనలు వస్తున్నాయని వ్యాఖ్య
- ముంబైలో ఫార్చ్యూన్ ఇండియా అవార్డుల కార్యక్రమంలో కీలక ప్రసంగం

పెన్ పవర్ డెస్క్:రాజకీయ పార్టీలు, నాయకులు తమ సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి, పాలనలో, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో యువతను క్రియాశీల భాగస్వాములను చేయాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. జెన్ జీ యువత ఆలోచనలకు అనుగుణంగా రాజకీయాలు మారాల్సిన అవసరం ఉందని, వారిని తక్కువ అంచనా వేయరాదని హితవు పలికారు. బుధవారం నాడు ముంబైలో జరిగిన

- మిగతా 2లో



## యుద్ధ ట్యాంకులు.. సరిహద్దుల్లో ఉక్కు గోడల్లాంటివి

పెన్ పవర్ డెస్క్:యుద్ధ ట్యాంకులు దేశ సరిహద్దుల్లో ఉక్కు గోడల్లాంటివని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. డ్రోన్లు, క్షిపణుల పాత్ర పెరుగుతున్నప్పటికీ.. భూతల దాడుల్లో యుద్ధ ట్యాంకులు కీలకమని తెలిపారు. అవి శత్రువుల పాలిట సింహస్వప్నంలా నిలుస్తాయని, యుద్ధక్షేత్రంలో సైనికుల మనోధైర్యాన్ని

- మిగతా 2లో



## నేపాల్ వరదలు.. ఏపీ, తెలంగాణకు చెందిన 29 మంది గల్లంతు

- నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాల యాత్రికులు
- ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మంది గల్లంతు
- యాత్రికుల భద్రతపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమీక్షలు
- బాధితుల సహాయం కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు
- కేంద్ర ప్రభుత్వం, రాయబార కార్యాలయాలతో సమన్వయం

- మిగతా 2లో

## అమరావతిలోని వీఐటీ-ఏపీ, ఆక్టేవ్ మధ్య కీలక ఒప్పందం

- ఏఐ, ఎంఎల్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విద్యార్థులకు శిక్షణ
- రెండేళ్ల కాలపరిమితితో వీఐటీ-ఏపీ, ఆక్టేవ్ మధ్య ఒప్పందం
- విద్యార్థులకు నేరుగా లభించనున్న రియల్-టైమ్ అనుభవం

పెన్ పవర్ డెస్క్:అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం, ప్రముఖ సాంకేతిక సంస్థ 'ఆక్టేవ్' మధ్య రెండేళ్ల కాలపరిమితితో ఒక కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్

- మిగతా 2లో




## జగన్ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల ధ్వంసం

- పోలవరం పనులను జగన్ నిర్లక్ష్యం చేశారన్న అచ్చెన్నాయుడు
- ఆ ప్రాజెక్టును గోదావరి జలాల్లో ముంచేశారని మండిపాటు
- గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును ప్రారంభిస్తామని వెల్లడి

- మిగతా 2లో

పెన్ పవర్ డెస్క్:వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ పోలవరం పనులను నిర్లక్ష్యం చేయకుండా





## నకిలీ వైద్యులపై కఠిన నిఘా.. హైదరాబాద్ లో 12 మంది అరెస్ట్..

### సజ్జనార్ తీవ్ర హెచ్చరిక

- నకిలీ వైద్యులపై హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం
- విద్యార్హతలు లేని కొందరు డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారన్న సజ్జనార్
- నకిలీ డాక్టర్ల బారిన పడొద్దని ప్రజలకు హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:వైద్యం పేరుతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులపై హైదరాబాద్ నగర పోలీసులు ఉక్కుపాదం మోపారు. నగరంలో కనీస అర్హతలు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 12 మందిని గుర్తించి

- మిగతా 2లో

## కాన్పూర్‌లో కూలిన శిక్షణ విమానం.. ఇద్దరు పైలట్లు మృతి

- యూపీలోని కాన్పూర్‌లో విమాన ప్రమాదం
- ప్రమాదంలో పైలట్, కో-పైలట్ అక్కడికక్కడే మృతి
- గంగా నది సమీపంలోని పొలాల్లో కూలిన విమానం
- నియంత్రణ కోల్పోవడంతోనే ప్రమాదం జరిగిందని అంచనా

పెన్ పవర్ డెస్క్:ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో గురువారం ఘోర విమాన ప్రమాదం సంభవించింది. ఒక ట్విన్ ఇంజిన్ శిక్షణ విమానం గంగా నది సమీపంలోని వ్యవసాయ క్షేత్రాల్లో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ఉన్న పైలట్, కో-పైలట్ ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.

- మిగతా 2లో



## ఘోర విపత్తు.. మోదీ అత్యవసర సహాయం అందించారు



- ఆకస్మిక వరదలతో అల్లాడిపోయిన నేపాల్
- దేశం ఎన్నడూ చూడని ఘోర విపత్తు అన్న బాలేన్ షా
- ఆర్మీ పూర్తి స్థాయిలో రంగంలోకి దిగిందని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:టిబెట్ సరిహద్దు ప్రాంతంలో ఊహించని విధంగా వచ్చిన ఆకస్మిక వరదల వల్ల నేపాల్ తీవ్రంగా నష్టపోయింది. భోటేకోశి నదిలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగి గ్రామాలు, ప్రాజెక్టు సైట్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో పెద్ద సంఖ్యలో మృతి చెందగా, వందలాది మంది గల్లంతయ్యారు. ఈ దారుణ విపత్తుపై నేపాల్ ప్రధాని

- మిగతా 2లో

## జగన్ గతంలో ఆవు కథ చెప్పేవారు.. ఇప్పుడు కోతి, పులి కథలు చెబుతున్నారు

- జగన్‌కు ఇప్పుడే ఎల్ నినో గుర్తొచ్చిందా? అంటూ మంత్రి పార్థసారధి ఫైర్
- బీసీ రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టులో ఎందుకు పోరాడలేదని నిలదీత
- ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్
- రాయలసీమ ప్రాజెక్టులపై జగన్ చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలేనని విమర్శలు
- సెప్టెంబర్ 3న ఉత్తరాంధ్రకు పోలవరం జలాలు అందిస్తామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:గత రెండేళ్లుగా బెంగళూరులో సేద తీరిన మాజీ ముఖ్యమంత్రి జగన్ కు అకస్మాత్తుగా ఇప్పుడు 'ఎల్ నినో' గుర్తుకు వచ్చిందా?" అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే, శాసనసభకు వచ్చి చర్చించాలే గానీ, సొంత మీడియా ముందు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్థసారథి మాట్లాడుతూ.. బీసీలు, రైతులపై జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారని, ఆయన చెప్పే అబద్ధాలను ప్రజలు



- మిగతా 2లో




## బొత్స సత్యనారాయణ వైసీపీని వీడుతున్నారా? కారణాలివేనా?

బొత్స సత్యనారాయణ వైసీపీని వీడతారన్న చర్చ జోరుగా సాగుతుంది. బొత్స సత్యనారాయణ జనసేనలో చేరనున్నట్లు కూడా చెబుతున్నారు. బొత్స సత్యనారాయణ గత కొంత కాలంగా అసంతృప్తితో ఉన్న కారణంగా ఆయన పార్టీ మారాలని నిర్ణయించుకున్నారని అంటున్నారు. మరొకవైపు కుటుంబ సభ్యుల రాజకీయాల అవసరం కోసం కూడా బొత్స సత్యనారాయణ పార్టీ మారే అవకాశముందని అంటున్నారు. గత కొన్ని రోజులుగా బొత్స సత్యనారాయణ జనసేనలో చేరతారని ప్రచారం జరుగుతున్నప్పటికీ ఆయన ఎటువంటి ఖండనలు చేయకపోవడం ఈ ప్రచారానికి మరింత ఊతమిచ్చినట్లయింది. అయితే బొత్స సత్యనారాయణ పార్టీ మారడానికి గల కారణాలు కూడా కొందరు విశ్లేషిస్తున్నారు.

**అసంతృప్తిగా ఉన్నారని...కానీ?**

బొత్స సత్యనారాయణ వైసీపీ నాయకత్వంపై అసంతృప్తిగా ఉన్నారన్నది ప్రచారం. అయితే వైసీపీ 2019 లో అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి కాలం మంత్రిగా జగన్ కేబినెట్ లో ఉన్నారు. మంత్రి వర్గ విస్తరణ జరిగినా ఆయన శాఖ మారింది కాని, కేబినెట్ నుంచి జగన్ తప్పించలేదు. విజయనగరం జిల్లాలో బలమైన నేత కావడం, సామాజికవర్గం, ఉత్తరాంధ్రలో సీనియర్ నేత కావడంతో బొత్స సత్యనారాయణ ను కంటిన్యూ చేశారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయిన తర్వాత కూడా బొత్స కు వైసీపీ నుంచి అన్యాయం జరగలేదు. ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయితే అందులో పోటీకి బొత్స సత్యనారాయణకు అవకాశమిచ్చారు. ఎమ్మెల్సీగా గెలిచిన బొత్సకు శాసనమండలిలో శాసనసభ పక్ష నేత గా నియమించారు. దీంతో బొత్స అసంతృప్తికి గల కారణాలేంటి? అన్న దానిపై పార్టీలో చర్చ జరుగుతుంది.

**జనసేనలో చేరబోతున్నారనే...**

బొత్స సత్యనారాయణ జనసేనలో చేరబోతున్నారనే దానిపై ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రచారం జరుగుతోంది. విజయనగరం జిల్లా రాజకీయాల్లో సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కుటుంబం జనసేనలోకి మారుతుందన్న చర్చ నడుస్తోంది, వైసీపీలో భవిష్యత్తు, స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె డాక్టర్ అనూష రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం. మెగా కుటుంబంతో ఉన్న సత్సంబంధాల కారణంగా వారు జనసేన వైపు చూస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, దీనిపై బొత్స కుటుంబం లేదా జనసేన పార్టీ నుండి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కానీ జనసేనలో చేరినా వైసీపీ తరహాలోనే ఇదేరకమైన పదవులను ఆయన సాధించగలరు. అంతకు మించి సాధించిందేమీ ఉండదు. ఇప్పటికే బొత్స సత్యనారాయణ తన కుమార్తె స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయనగరం జడ్పీ ఛైర్మన్ గా పోటీ చేస్తారని ప్రకటించారు. వైసీపీ నాయకత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రచారానికి తెరదించాలంటే సత్తిబాబు నోరు విప్పాల్సిందే.

## యుద్ధ ట్యాంకులు.. సరిహద్దుల్లో ఉక్కు గోడల్లాంటివి

- మొదటి పేజి తరువాయి

పెంచుతాయని చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని 'వెహికల్ ఫ్యాక్టరీ జబల్‌పుర్'లో టీ-సిరీస్ యుద్ధ ట్యాంకుల మరమ్మతుల కోసం రూ.472 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కేంద్రానికి శంకుస్థాపన చేసిన అనంతరం రాజ్‌నాథ్ (=ఖుయఅఫ్ష్ర ాఅఅస్త్రష్ట్ర) ఈమేరకు ప్రసంగించారు.

**లక్ష చెట్లకు రాఖీలు కట్టనున్న గ్రామస్థులు..!**

"అత్యంత శక్తిమంతమైన సైన్యం కలిగిన దేశాల్లో భారత్ ఒకటి. డ్రోన్లు, క్షిపణులు, ఇతర అధునాతన సాంకేతికతలతో యుద్ధం తీరు వేగంగా మారుతోంది. అంతమాత్రాన ట్యాంకులు ప్రాధాన్యం కోల్పోయాయని కాదు. రణరంగంలో ఒకే వ్యవస్థపై ఆధారపడకుండా.. సమష్టి సామర్థ్యం కలిగి ఉండటం అవసరం. డ్రోన్లు, క్షిపణులు, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలతోపాటు ఆధునిక ట్యాంకులూ ముఖ్యమే. భూతల దాడుల్లో టీ-72, టీ-90 ట్యాంకులు ఎంతో కీలకం. దేశ సరిహద్దుల్లో అవి ఉక్కు గోడలా నిలుస్తాయి. కొత్తగా ఏర్పాటు చేయనున్న కేంద్రంలో ఏటా 80 ట్యాంకులకు మరమ్మతులు చేయొచ్చు" అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

# జగన్ గతంలో ఆవు కథ చెప్పేవారు.. ఇప్పుడు కోతి, పులి కథలు చెబుతున్నారు

- మొదటి పేజి తరువాయి

నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు. జగన్ ఇదివరకు ఆవు కథ చెప్పేవారు, ఇప్పుడు కోతి, పులి కథలు చెబుతున్నారు అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.గత ఐదేళ్ల పాలనలో కనీసం ఒక్క కరవు నివారణ చర్య కూడా చేపట్టని బలహీన ముఖ్యమంత్రి జగన్ అని పార్థసారథి విమర్శించారు. "బెంగళూరులో ఉన్న జగన్‌కు ఎల్ నినో గురించి తెలియకపోవచ్చు. కానీ ఇప్పుడు అకస్మాత్తుగా గుర్తుకు వచ్చింది. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం ముందునుంచే చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే వరి వంగడాలను ప్రోత్సహిస్తున్నాం. వరి, మినుము, పత్తి వంటి పంటలకు తక్కువ ప్రీమియంతోనే బీమా చేయిస్తున్నాం" అని వివరించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు చేసిన ద్రోహం, విధ్వంసం బయటపడుతుందనే భయంతోనే జగన్ అసెంబ్లీకి రావడం లేదని ఆరోపించారు.

**మండలిలో చర్చకు ఎందుకు రాలేదు?**

రైతులపై అంత ప్రేమ ఉంటే, ఎల్ నినో అంశంపై శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలతో ఎందుకు చర్చకు పట్టుబట్టలేదని మంత్రి పార్థసారథి ప్రశ్నించారు. "విలువైన మండలి సమయాన్ని డిప్యూటీ ఛైర్మన్‌ను పొగడటానికే సరిపెట్టారు. నాలుగు గంటలపాటు కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతూ, డిప్యూటీ ఛైర్మన్‌ను పొగిడేందుకు సమయాన్ని వృథా చేశారు. పత్రికా ప్రకటనలతో సానుభూతి చూపిస్తే సమస్యలు పరిష్కారం కావు" అని స్పష్టం చేశారు.

**బీసీలను మోసగించిన వ్యక్తి జగన్**

బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లను హైకోర్టు వ్యతిరేకిస్తే, దానిపై సుప్రీంకోర్టుకు వెళ్లి జగన్ ఎందుకు పోరాడలేదని పార్థసారథి నిలదీశారు. "జగన్ నిర్వాకం వల్ల 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారు. 1995లోనే చంద్రబాబు ప్రత్యేక చట్టం చేసి బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించారు. నామినేటెడ్ కాంట్రాక్టుల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు ఇస్తానని అసెంబ్లీ సాక్షిగా మాట తప్పిన వ్యక్తి జగన్. నేతి బీరకాయలో నెయ్యి ఎంత నిజమో, జగన్ మాటలు కూడా అంతే. బీసీలపై అంత ప్రేమ ఉంటే ఒక్క బీసీకి అయినా వైస్ ఛాన్సలర్ పదవి ఇచ్చారా? అధికారంలో ఉన్నప్పుడు బీసీల భూములు కొట్టేశారు, వారిని నరికి చంపారు. ఇప్పుడు వారిపై ప్రేమ నటిస్తున్నారు" అని తీవ్రంగా విమర్శించారు.

**రాయలసీమకు చేసిందేమీ లేదు**

రాయలసీమ ప్రాజెక్టులకు జగన్ తన ఐదేళ్ల పాలనలో ఖర్చు పెట్టింది కేవలం రూ. 2,000 కోట్లు మాత్రమేనని, కానీ కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రూ. 13,500 కోట్లు ఖర్చు చేసి, మరో రూ. 10,000 కోట్లు ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. "సొంత జిల్లా కడపలో స్టీల్ ప్లాంట్‌కు రెండుసార్లు కొబ్బరికాయ కొట్టారు కానీ ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పోలవరం పనులను జగన్ అటకెక్కించారు. మేము అధికారంలోకి వచ్చాక పనులు పూర్తిచేసి సెప్టెంబర్ 3 నాటికి ఉత్తరాంధ్రకు నీళ్లు ఇస్తున్నాం" అని స్పష్టం చేశారు. మద్యం కేసులో అరెస్టులు కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధిస్తోందని జగన్ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

## ఘోర విపత్తు.. మోదీ అత్యవసర సహాయం అందించారు

- మొదటి పేజి తరువాయి

బాలేంద్ర బాలేన్ షా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది దేశం ఎన్నడూ చూడని రీతిలో సంభవించిన ఘోర విపత్తు అని ఆయన అభివర్ణించారు. బాధితుల రక్షణ, సహాయక చర్యల కోసం నేపాల్ ఆర్మీ, సాయుధ పోలీసు బలగాలు, విపత్తు నిర్వహణ బృందాలు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగాయని వెల్లడించారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు ఆర్మీ హెలికాప్టర్ల ద్వారా విరామం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.ఇప్పటికే రసువా జిల్లాలోని తిమురే ప్రాంతం నుంచి 21 మంది భారతీయులతో సహా 116 మందిని నేపాల్ ఆర్మీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చిందని తెలిపారు. బాధితులకు ఆహారం, తాత్కాలిక నివాసం, వైద్య సహాయం అందించేందుకు ప్రభుత్వం

తన వద్ద ఉన్న పూర్తి యంత్రాంగాన్ని వినియోగిస్తోందని భరోసా ఇచ్చారు. ఈ క్లిష్ట సమయంలో భారత్ సహా అంతర్జాతీయ దేశాలు సహాయం అందించేందుకు ముందుకు వచ్చినట్లు ప్రధాని తెలిపారు. భారత ప్రధాని మోదీ నేరుగా ఫోన్ చేసి పరామర్శించి, 10 టన్నుల అత్యవసర సహాయక సామాగ్రిని పంపించారని, వారికి ప్రధాని షా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బాధితులెవరూ అధైర్యపడవద్దని, అందరినీ ఆదుకునే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నేపాల్ వరదలు.. ఏపీ, తెలంగాణకు చెందిన 29 మంది గల్లంతు

నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల యాత్రికులను తీవ్ర కష్టాల్లోకి నెట్టాయి. ఈ విపత్తు కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మందితో సహా మొత్తం 29 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు గురువారం తెలిపారు. వీరిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు యాత్రికుల ఆచూకీ తెలియరాలేదని, మరో 34 మంది సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. కర్నూలు-ఆదోనికి చెందిన నలుగురు టిబెట్‌లో క్షేమంగా ఉండగా, తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండులో సురక్షితంగా ఉన్నట్లు రియల్-టైమ్ గవర్నెన్స్ సొసైటీ (=+ూ) ద్వారా సంప్రదించి నిర్ధారించుకున్నారు. గల్లంతైన ఏడుగురిలో చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరుకు చెందిన వారున్నారు. వీరిలో ముగ్గురు ఈశా ఫౌండేషన్ నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారని, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ వస్తున్నాయని తెలిపారు.ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బాధితుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, ఖాట్మండు, చైనాలలోని భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. రోడ్డు, వాయు మార్గాల పునరుద్ధరణతో పాటు, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా యాత్రికులను తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యల కోసం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.తెలంగాణకు చెందిన 22 మంది యాత్రికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. మొదట 23 మంది గల్లంతైనట్లు భావించినా, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక యాత్రికుడు తన కుటుంబంతో మాట్లాడటంతో అతను సురక్షితంగా ఉన్నట్లు తేలింది. గల్లంతైన వారిలో ఆరుగురు

తెలంగాణకు చెందినవారు కాగా, 17 మంది తెలంగాణ మూలాలున్న ఎన్నారైలు. వీరిలో చాలామంది నేపాల్-టిబెట్ సరిహద్దులోని రసువా, రసువాగఢి, గైరాంగ్ వంటి ప్రాంతాల్లో ఉన్నట్లు చివరిసారిగా తెలిసిందని అధికారులు పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీలోని తెలంగాణ భవన్, హైదరాబాద్‌లోని సచివాలయంలో హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దాదాపు 80-100 కాల్స్ వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ గల్లంతైన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధితుల కుటుంబాలు, ట్రావెల్ ఆపరేటర్ల నుంచి వచ్చిన సమాచారాన్ని ధ్రువీకరించుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

## అమరావతిలోని వీఐటీ-ఏపీ, ఆక్టేవ్ మధ్య కీలక ఒప్పందం

- మొదటి పేజి తరువాయి

వంటి వేగంగా ఎదుగుతున్న ఆధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఆచరణాత్మక శిక్షణను అందించడమే ఈ భాగస్వామ్య ఒప్పందం ముఖ్య ఉద్దేశం.ఈ ఒప్పందంలో భాగంగా ఆక్టేవ్ సంస్థకు చెందిన నిపుణులైన మెంటార్లతో కలిసి విద్యార్థులు ప్రత్యక్షంగా ప్రాజెక్టులను రూపొందించనున్నారు. ప్రతి ప్రాజెక్టులోనూ ఒక ప్రొఫెసర్‌తో పాటు నలుగురు విద్యార్థులు, ఇద్దరు మెంటార్లు భాగస్వాములుగా ఉంటూ, మూడు నెలల నిర్ణీత వ్యవధిలో ప్రాజెక్టును పూర్తి చేసేలా ప్రణాళికను సిద్ధం చేశారు. దీనివల్ల విద్యార్థులకు రియల్-టైమ్ అనుభవం నేరుగా లభించనుంది. అంతేకాకుండా, మార్కెట్ అవసరాలకు తగినట్లుగా వీఐటీ-ఏపీలో ాూ×, మీూ పాఠ్యాంశాల రూపకల్పనకు ఆక్టేవ్ సంస్థ తగిన సూచనలు, సలహాలు అందించనుంది. విద్యార్థులలో సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించేందుకు హ్యాకథాన్‌లు నిర్వహించడంతో పాటు, వారికి ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాల కల్పనలోనూ ఇరు సంస్థలు సంయుక్తంగా వ్యవహరించనున్నాయి. సాంకేతిక రంగానికి అవసరమైన ప్రతిభావంతులైన యువతను తీర్చిదిద్దడమే ఈ అవగాహన ఒప్పందం ప్రధాన లక్ష్యమని విశ్వవిద్యాలయ నిర్వాహకులు వెల్లడించారు.

## జగన్ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల ధ్వంసం

- మొదటి పేజి తరువాయి

కొనసాగించి ఉంటే రాష్ట్రంలో ఎల్ నినో పరిస్థితులు వచ్చినా రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదని వ్యాఖ్యానించారు.

టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హంద్రీనీవా ప్రాజెక్టుపై 16 నెలల్లోనే రూ.3,500 కోట్లు ఖర్చు చేసి కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సాగునీరు అందించామని అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో 74 శాతం మేర పూర్తయిన పోలవరం ప్రాజెక్ట్‌ను వైసీపీ ప్రభుత్వం రాగానే ఒక ఏడాది పాటు నిరంతరాయంగా పూర్తి చేసి ఉంటే ఇక్కట్లన్నీ తీరేవని, కానీ ఆ ప్రాజెక్టును గోదావరి వరదల్లో ముంచేసి నాశనం చేశారని మండిపడ్డారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం తిరిగి పోలవరాన్ని గాడిలో పెట్టిందని, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్ట్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని స్పష్టం చేశారు.

అలాగే, 1995లో వెలిగొండ ప్రాజెక్ట్‌కు చంద్రబాబు శంకుస్థాపన చేశారని... ఇప్పుడు ప్రాజెక్ట్‌ను ఆయనే పూర్తి చేసి, జాతికి అంకితం చేయబోతున్నారని చెప్పారు. గతంలో తొండలు కూడా గుడ్లు పెట్టని రాతి నేలల్లో వెలిగొండను నిర్మించామని, పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు త్వరలోనే ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని తాకబోతున్నాయని వెల్లడించారు.

## కాన్పూర్‌లో కూలిన శిక్షణ విమానం.. ఇద్దరు పైలట్లు మృతి

- మొదటి పేజి తరువాయి

శిక్షణలో భాగంగా గగనతలానికి ఎగిరిన ఈ విమానం, కొద్దిసేపటికే సాంకేతిక లోపం లేదా ఇతర కారణాలతో నియంత్రణ కోల్పోయి నేరుగా పొలాల్లో కూలిపోయినట్లు అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, ఈ ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన పైలట్ల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబాలకు ఈ తీరని లోటును భరించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. కాగా, ప్రమాద కారణాలపై అధికారులు ఇప్పటికే సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు.

## రాజకీయాల్లోకి జెన్ జీ.. ఇగో వీడి యువతను కలుపుకుపోవాలి:

- మొదటి పేజి తరువాయి

'ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40' అవార్డుల కార్యక్రమంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజకీయాలు, పాలనలో యువత భాగస్వామ్యంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "యువతరంతో నా అనుభవం ద్వారా నేను నేర్చుకున్న అతిపెద్ద పాఠం చాలా సులభమైంది. వారిని ఎప్పుడూ తక్కువ అంచనా వేయొద్దు, వారిని తక్కువ చేసి మాట్లాడొద్దు. వారిని మొత్తం అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములను చేయాలి" అని అన్నారు. రాజకీయాల్లో యువత ప్రాధాన్యంపై ప్రస్తుత చర్చకు చాలా కాలం ముందే తాను, తమ ముఖ్యమంత్రి గారు యువతతో మమేకమవుతున్నామని లోకేశ్ గుర్తుచేశారు. తాము ఒక నియోజకవర్గానికి వెళ్లినప్పుడు, అక్కడి యువత, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రత్యేకంగా సమావేశమవుతామని వివరించారు. ""మేము ఇంకా మెరుగ్గా ఎలా చేయగలం?', 'ఈ నియోజకవర్గంలో విభిన్నంగా ఏం చేయొచ్చు?' అని వారిని అడుగుతాం" అని తెలిపారు. ఇలాంటి నిర్మాణాత్మక చర్చల నుంచి ఎన్నో అద్భుతమైన ఆలోచనలు పుట్టుకొస్తాయని, వాటిని కేవలం వినడమే కాకుండా, అమలు చేయడానికి తమ వద్ద ఒక పక్కా వ్యవస్థ ఉందని లోకేశ్ తెలిపారు.

"యువత నుంచి వచ్చే ఆలోచనలను స్వీకరించి, వాటిని ఫాలో-అప్ చేసే విధానం మాకుంది. వారిని సంభాషణలో భాగం చేయడమే వారు కోరుకుంటున్న మొదటి విషయం అని నేను నమ్ముతున్నాను" అని ఆయన పేర్కొన్నారు. యువత సూచనలు, ఆలోచనలతో పాలనను మరింత మెరుగుపరచవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రాజకీయ నాయకులు కూడా తమ వైఖరిని మార్చుకోవాలని లోకేశ్ సూచించారు. "రాజకీయ నాయకులుగా మనం మన ఇగోని, అడ్డుగోడలను వదిలేయడం చాలా ముఖ్యం. ఈ రోజుల్లో యువత మీతో భావోద్వేగ స్థాయిలో మమేకమవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. వారు మీ నుంచి కోరుకునేది కేవలం ప్రామాణికత మాత్రమే" అని అన్నారు. కల్మషం లేనితనం, పారదర్శకతే భారతదేశంలో తర్వాతి తరం రాజకీయ నాయకులకు ముఖ్యమైన లక్షణాలుగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. "భారతదేశంలో నవతరం రాజకీయ నాయకుల నుంచి యువత ఆశిస్తున్నది అదేనని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని లోకేశ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

## నకిలీ వైద్యులపై కఠిన నిఘా.. హైదరాబాద్ లో 12 మంది అరెస్ట్..

- మొదటి పేజి తరువాయి

కఠిన చర్యలు తీసుకున్నామని పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు.

కనీస వైద్య విద్యార్హతలు, ఎలాంటి పరిజ్ఞానం లేని కొందరు వ్యక్తులు తాము డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, బీపీ, డయాబెటిస్ మందులను ఇస్తూ, ఇష్టారీతిన ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తున్నారని తెలిపారు. ఇటువంటి శాస్త్రీయత లేని వైద్యం వల్ల బాధితుల ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు దెబ్బతిని ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు.ఈ సందర్భంగా నకిలీ డాక్టర్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. క్లినిక్ లేదా ఆసుపత్రి రిసెప్షన్ వద్ద డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉందో లేదో కచ్చితంగా గమనించాలని తెలిపారు. అలాగే వైద్యుడి బోర్డుపై పేరు, చదివిన విద్యార్హతలతో పాటు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఒకవేళ వైద్యుడి అర్హతలపై కొద్దిగా అనుమానం వచ్చినా అధికారిక వెబ్‌సైట్ ద్వారా వివరాలు చెక్ చేసుకోవచ్చని, రికార్డుల్లో వివరాలు కనిపించకపోతే ఆ వైద్యుడిని నకిలీగా పరిగణించవచ్చని స్పష్టం చేశారు.తీసుకుంటున్న చికిత్సపై సందేహాలు ఉంటే వెంటనే అర్హత కలిగిన మరో డాక్టర్ వద్ద 'సెకండ్ ఒపీనియన్' తీసుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఎవరైనా నకిలీ వైద్యులు చలామణి అవుతున్నట్లు తెలిస్తే వెంటనే 'డయల్ 112' కి గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో ఆడుకునే నకిలీ డాక్టర్లపై నిరంతరం తనిఖీలు, కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న విద్యాశాఖ అధికారి కి ఉపాధ్యాయులు చేయూత...




**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్టు27;** అడ్డతీగల మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న కే. రమేష్ గత 20 రోజులుగా అనారోగ్య కారణంతో ఆస్పత్రి చేరిన కారణంగా మండల విద్యాశాఖ అధికారి కే. రమేష్ కుఆసుపత్రి ఖర్చు నిమిత్తం 52,000 /- రూపాయలను మండల విద్యాశాఖ అధికారి పి. శ్రీనివాసరావు .2 మరియు అడ్డతీగల మండలంలో ని ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయుల సహకారంతో విరాళంగా సేకరించి మండల విద్యాశాఖ అధికారి 2 పి .శ్రీనివాసరావుకు చెక్కు రూపంలో అందజేశారు. వారి కుటుంబ సభ్యులకు ఫోన్ పే ద్వారా మొత్తాన్ని అందజేయడం జరిగిందని, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆపదలో ఉన్న మండల విద్యాశాఖ అధికారి కి ఆర్థిక సాయం చేసిన ఉపాధ్యాయుల ఔదార్యాన్ని , మానవత్వాన్ని మరియొకసారి నిరూపించుకున్నారని, ఉపాధ్యాయులందరినీ విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు ప్రశంసించారు. మరియు వారు త్వరగా కోలుకొని వీధిలోకి హాజరు కావాలని మండల విద్యాశాఖ అధికారి పి .శ్రీనివాసరావు ఆకాంక్షించారు. సహాయ సహకారాలు అందించిన ఉపాధ్యాయులందరికీ విద్యాశాఖ అధికారి పి. శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## శశిలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 27:** శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ )లో నూతనంగా చేరిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల్ కృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీమతి మేకా క్రాంతి సుధ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మహమ్మద్ ఇస్మాయిల్ మరియు వివిధ విభాగాల అధిపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ వేణు గోపాల్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మక ఆలోచన, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధా మాట్లాడుతూ విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను




పెంపొందించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొదటి సంవత్సరం నుంచే అకడమిక్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి, క్రమశిక్షణ, సమయపాలన, నైపుణ్యాభివృద్ధితో భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడే - రక్షాబంధన్- రాఖీల పండుగ.

## గోకవరంలో చిన్న దుకాణం నుండి పెద్ద షాపు వరకు రంగురంగుల రాఖీల సందడి





**గోకవరం పెన్ పవర్ ఆగష్టు 27:**-అన్నా చెల్లెళ్ల అను బంధానికి ప్రతీక అయిన రక్షాబంధన్ పండుగ నేపథ్యంలో గోకవరం మండలం మొత్తం సందడిగా మారింది. నేడు (ఆగస్టు 28) రక్షాబంధన్ పండుగ నేపథ్యంలో మండలంలోని ప్రతి గ్రామంలో రాఖీల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి.

**ప్రతి గ్రామంలో రాఖీల కళకళ:**

గోకవరం మండల కేంద్రంతో పాటు గోకవరం,రంప ఎర్రం పాలెం,మల్లవరం,కొత్తపల్లి, క్రిష్ణునిపాలెం తదితర ప్రతి గ్రామంలోనూ రోడ్ల పక్కన చిన్న చిన్న బండ్ల మీద నుండి పెద్ద ఫ్యాన్సీ స్టోర్స్ వరకు రాఖీలే రాఖీలు దర్శనమిస్తున్నాయి. చిన్న పిల్లలకు బాల హనుమాన్, చోటా భీమ్, డోరేమాన్ బొమ్మల రాఖీలు, యువతకు లైటింగ్ రాఖీలు, స్టోన్ వర్క్ రాఖీలు, సిల్వర్, గోల్డ్ ప్లేటెడ్ రాఖీలు, పెద్దలకు రుద్రాక్ష రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

**ధరలు ఇలా...**

మార్కెట్లో రాఖీల ధరలు రూ.10 నుండి మొదలుకొని రూ. 300 వరకు ఉన్నాయి.సాధారణ దారం రాఖీలు రూ. 10 - 20,,స్టోన్, జరీ వర్క్ రాఖీలు - రూ. 50 - 100,,లుంబా రాఖీలు (వదినల కోసం) - రూ. 100 - 150,,పిల్లల బొమ్మల రాఖీలు - రూ. 30 - 80 చొప్పున విక్రయాలు సాగుతున్నాయి.

**జనం రద్దీ - వ్యాపారుల్లో ఆనందం:**

గత రెండు రోజులుగా గోకవరం సెంటర్, బస్టాండ్ ఏరియా, మెయిన్ రోడ్డులోని ఫ్యాన్సీ షాపులు జనం తో కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున వచ్చి తమ అన్నల కోసం నచ్చిన రాఖీలను ఎంపిక చేసు కుంటున్నారు. చిన్న దుకాణాల వద్ద కూడా వ్యాపారం జోరుగా సాగుతుండటంతో చిరు వ్యాపారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

**అక్కాచెల్లెళ్ల సెంటిమెంట్:**

ఉద్యోగరీత్యా దూరంగా ఉన్న అన్నయ్యకు రాఖీని పోస్టులో పంపిస్తాను, అన్నయ్య క్షేమంగా ఉండాలని కోరుకుంటూ రాఖీ కడతాను అని గోకవరానికి చెందిన ఓ యువతి తెలిపింది. మరో మహిళ మాట్లాడుతూ ఆన్ లైన్ లో కంటే ఇక్కడ మార్కెట్లో నేరుగా చూసి కొనడంలోనే ఆనందం ఉందని చెప్పారు.మొత్తంగా గోకవరం మండలం అంతటా రక్షాబంధన్ పండుగ శోభ సంతరించుకుంది. రంగురంగుల రాఖీలతో మార్కెట్ అంతా కళకళలాడుతూ, అన్నాచెల్లెళ్ల ప్రేమకు అద్దం పడుతోంది.

# సివిల్ సప్లైలో నూతన క్యూఆర్ కోడ్ విధానం డీలర్లకు భారంగా మారింది




★ సాంకేతిక సమస్యలు, పని భారంతో డీలర్లు విలవిల

★ పునఃసమీక్షించాలని గోకవరం తహశీల్దార్ కు వినతి

**గోకవరం పెన్ పవర్ ఆగష్టు 27:**-రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లై శాఖ ద్వారా ప్రవేశపెట్టిన నూతన క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం క్షేత్రస్థాయిలో రేషన్ డీలర్లకు పెద్దభారంగా మారింది.ఈ విధానాన్ని పునఃసమీక్షించాలని కోరుతూ గోకవరం మండల రేషన్ డీలర్లు అసోసియేషన్ అధ్యక్షులు మలిరెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో రేషన్ డీలర్ల తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు బుంగరాజు తో కలిసి గోకవరం మండల తహశీల్దార్ కి గురువారం వినతి పత్రం అందజేశారు.

**ప్రభుత్వం ఎందుకు తెచ్చింది...?**

పౌర సరఫరాల శాఖ సమాచారం ప్రకారం, బియ్యం బస్తాల అక్రమ రవాణా, రీసైక్లింగ్ అరికట్టేందుకు, ప్రతి బస్తా ఎక్కడి నుండి వచ్చింది, ఏ సీజన్ ధాన్యం, ఏ మిల్లు నుండి వచ్చింది అనేది తెలుసుకోవడానికి ఈ క్యూఆర్ కోడ్ విధానాన్ని తీసుకువచ్చారు. ఇది పారదర్శకత కోసం మంచి ఆలోచనే అయితే

సెప్టెంబర్ నెల నుండి పంపిణీ చేసే 10 శాతం బ్రోకెన్ రైస్ బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్ స్కానింగ్ ప్రభుత్వం తప్పనిసరి చేశారు దీనితో సమయం వృధా అవ్వడం అధిక భారం పడుతుందని డీలర్లతో మా ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ప్రతి డీలర్ లెవల్ స్టాక్ పాయింట్ నుండి బస్తా తీసుకునేటప్పుడు ఒకసారి

తన రేషన్ షాపు స్టాక్ లో నమోదు చేసేటప్పుడు రెండోసారి లబ్ధిదారులకు పంపిణీ చేసేటప్పుడు ఈ-పాస్ లో మూడోసారి స్కాన్ చేయాల్సి ఉందని

ఒక్క బస్తాకు మూడు సార్లు స్కానింగ్ చేయడం వల్ల పని భారం విపరీతంగా పెరిగిందని డీలర్లు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చాలా మంది డీలర్లకు ఇప్పటికీ ఆండ్రాయిడ్ మొబైల్స్ అందుబాటులో లేవు. యాప్ డౌన్ లోడ్ చేసుకునే పరిస్థితి కూడా లేదని దీనికి కారణం సిగ్నల్ సమస్య పెద్ద సమస్యగా ఉందని తమ ఆవేదన వ్యక్తం చేస్తు అయినప్పటికీ స్కానింగ్ చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. మండల లెవల్ స్టాక్ పాయింట్ల నుండి క్యూఆర్ కోడ్ నమోదు విధానం ఇంకా పూర్తిగా ప్రవేశపెట్టలేదు. పూర్తి అనుభవం ఉన్న సిబ్బంది, హమాలీలు ఉన్న స్టాక్ పాయింట్లలోనే ఈ విధానం చాలా భారంతో కూడుకున్న పని అని సౌకర్యాలు లేని రేషన్ షాపుల్లో ఎలా అమలు చేస్తారని డీలర్లు ప్రశ్నిస్తున్నారు.

**ప్రధానంగా తరుగు సమస్య - డీలర్లపై నింద:**

ఇప్పటికే ప్రతి నెలా ప్రతి డీలర్ 100 కేజీల నుండి 300 కేజీల వరకు మండల లెవల్ స్టాక్ పాయింట్లలో జరుగుతున్న తరుగు, అవకతవకల వల్ల నష్ట పోతున్నారు. దీనిని సరిచేయకుండా, ఇప్పుడు ప్రతి బస్తా 50 కేజీలుగా నిర్ధారిస్తూ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం వల్ల స్టాక్ పాయింట్లలో జరుగుతున్న లోపాలను కూడా డీలర్లతో మాఫీ చేయించినట్లు అవుతుందని, రాష్ట్రవ్యాప్తంగా డీలర్లు ఆందోళన చెందుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.


**కమీషన్ మరియు డోర్ డెలివరీ భారం:**

ప్రభుత్వం 65 సంవత్సరాలు దాటిన వారికి డోర్ డెలివరీ ద్వారా రేషన్ ఇవ్వాలని చెబుతోంది. దీనికి అయ్యే రవాణా ఖర్చులు, కమీషన్ పెంపుదలపై కూడా స్పష్టత ఇవ్వలేదని, దీనివల్ల తమకు ఆర్థిక భారం పెరుగుతోందని డీలర్లు తెలిపారు.

**డీలర్ల విజ్ఞప్తి:**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను తాము ఎప్పుడూ వ్యతిరేకించలేదని, అయితే నూతన విధానాన్ని అమలు చేసే ముందు క్షేత్రస్థాయిలో ఉన్న సాంకేతిక సమస్యలు,నెట్ వర్క్ ఇబ్బందులు,సిబ్బంది కొరతను పరిగణనలోకి తీసుకోవాలని, ఈ నూతన క్యూఆర్ కోడ్ విధానాన్ని ఒకసారి సమీక్షించి తమకు న్యాయం చేయాలని గోకవరం మండల రేషన్ డీలర్లు తహశీల్దార్ గారిని కోరారు.

రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఇచ్చిన విజ్ఞప్తిపై గోకవరం తాసిల్దార్ పి రామకృష్ణ స్పందిస్తూ డీలర్స్ అసోసియేషన్ తరఫున విజ్ఞాపనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని అన్నారని రేషన్ డీలర్ల అసోసియేషన్ గోకవరం మండల అధ్యక్షులు మలిరెడ్డి కృష్ణ తెలిపారు.



తేది.27.08.2026

గోకవరం మండలం రేషన్ డీలర్లు
వ్రాసుకొను ధరఖాస్తు విన్నపములు.

తూర్పు గోదావరి జిల్లా,
గోకవరం మండలం,
తహశీల్దారు వారి దివ్య సముఖమునకు.

విషయం : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను డీలర్లు ఎప్పుడు వ్యతిరేకం కాదు, అయితే సదరు రేషన్ బస్తాలపై క్యూఆర్ కోడ్ స్కానింగ్ వలన రేషన్ డీలర్లకు ఎదురవుతున్న ఇబ్బందుల, మరియు కమీషన్ పెంపుదల మరియు 65 సం॥ల వారికి డోర్ డెలివరి ఇచ్చే రేషన్ ఖర్చుల నిమిత్తం గురించి.

అయ్యా!

సెప్టెంబర్ నెల నుండి రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయు 10శాతం బ్రోకెన్ రైస్ బియ్యం బస్తాలపై నూతనంగా క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ చూయాలని రేషన్ డీలర్లకు ఆదేశాలు జారీ చేసి ఉన్నారు.ఆ క్యూ ఆర్‌కోడ్ స్కానింగ్ ప్రతి రేషన్ డీలర్ మండల లెవెల్ స్టాక్‌పాయింట్ నుండి దిగుమతి అయ్యే ప్రతి బస్తాను రేషన్‌షాపులో దిగుమి చేస్తున్న సమయంలో స్కాన్ చేస్తూ తన రేషన్ షాపు స్టాకు నిల్వలలో నమోదు చేయవలసి రావటం అదే విధంగా ప్రతి రెండు బస్తాలను రేషన్ పంపిణీ చేసే సమయంలో క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి ఈ-పోస్ నందు నమోదు చేస్తూ పంపిణీ చేయవలసి రావటం వలన రేషన్ డీలర్లకు పని భారం మరియు సాంకేతిక సమస్యలు ఎదురయ్యే పరిస్థితి వస్తుంది.

రేషన్ డీలర్లలో చాలా మందికి ఇప్పటికీ ఆండ్రాయిడ్ మొబైల్స్ అందుబాటులో లేకపోవడం వలన ఈ స్కానింగ్ చేసే సమయంలో యాప్‌ను డోన్‌లోడ్ చేసుకోనే పరిస్థితి లేదని తమరికి విన్నవించుకొనుచున్నాము. ఇదే సమయంలో మండల లెవెల్ స్టాక్ పాయింట్ల నందు క్యూఆర్ కోడ్ నమోదు చేయు అంశాన్ని ప్రవేశ పెట్టడం జరగలేదు. పూర్తి అనుభవం ఉన్న ఉద్యోగస్తులు అధిక సంఖ్యలో హమాలీలు అందుబాటులో ఉన్న మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో కూడా క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ అనేది ప్రవేశ పెట్టకపోవడం వలన రేషన్ డీలర్లకు ఇప్పటికే ఎన్నో దశాబ్దాల నుండి వచ్చుచున్న తరుగతుల సమస్యను ఇప్పటికి పరిష్కారం చేయకపోగా ఆ తరగతులను కూడా అధికారికంగా రేషన్ డీలర్లను మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో జరుగుతున్న తప్పులకు భాధ్యులంతను చేయటం డీలర్లకు తీవ్ర మనోవేదనకు గురి చేస్తుందని తమరికి తెలియజేసుకుంటున్నాము.

ఇప్పటికే ప్రతినెల అనధికారికంగా ప్రతి రేషన్ డీలరు తనకు ఉన్న అలాట్మెంటును బట్టి 100 కేజీల నుండి 300 కేజీల వరకు మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో జరుగుతున్న అవకతవల వలన నష్టపోతున్నారు. దీనిని సరి చేయకపోగా రేషన్ షాపులలో ప్రతి బస్తా 50 కేజీలుగా నిర్ధారిస్తూ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయటం వలన మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో జరుగుతున్న అవకతవకను అధికారికంగా రేషన్ డీలర్లతో మాఫీ చేయడం జరుగుతుందని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లు ఆవేదన చెందటం జరుగుతుంది ఎన్నో ఇబ్బందులు సమస్యలు పరిష్కారం చేయవలసిన సమయంలో వాటన్నింటిని పరిగణనలోకి తీసుకొకుండా కేవలం రేషన్ డీలర్లను భాధ్యులను చేస్తూ రేషన్ డీలర్లకు మనోవేదకు గురి చేస్తున్న నూతన క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని ఒకసారి సమీక్షించి మాకు న్యాయం చేయగలని శ్రీ అధికారి వారికి విన్నవించుకొనుచున్నాను.

ఇట్లు
తమ విధేయులు

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పోలవరం నిర్వాసితుల సమస్యలపై సీపీఐ ధర్నా

**చింతూరు, పెన్ పవర్ ఆగస్టు 27:** పోలవరం ప్రాజెక్టు కారణంగా విలీనమైన నాలుగు మండలాల ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం చింతూరులోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టు అధికారి శుభమ్ నొక్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఏటపాక మండలంలో ముంపు రైతులకు పరిహారం అందడం లేదని, నోటిఫికేషన్ ఇచ్చిన భూములకు ఇంతవరకు పరిహారం చెల్లించలేదని సీపీఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. 45 కాంటూర్ వరకు ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు ఇస్తూ, 41 కాంటూర్ వరకు మాత్రమే పరిహారం ఇస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పడం వల్ల ఏటపాక మండలం పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాల్లో పట్టా భూములతో పాటు అసైన్డ్, పోడు భూములకు కూడా పరిహారం చెల్లించాలని, నిర్వాసితులను ఖాళీ చేయించే తేదీని కటాఫ్‌గా నిర్ణయించి 18 ఏళ్లు నిండిన వారందరికీ పునరావాస పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏటపాక ముంపు భూముల్లో మరణించిన రైతుల వారసులకు భూ పట్టాలు మార్చి, అన్నదాత సుఖీభవ పథకం, యూరియా, డీఏపీ ఎరువులు అందించాలని కోరారు. ముంపు గ్రామాలకు కాంటూర్ స్థాయితో సంబంధం లేకుండా పరిహారం ఇవ్వాలని, 2027లో పోలవరం ప్రాజెక్టులో ఎంత మేర నీటిని నిల్వ చేస్తారో, గోదావరిలో వర్షాకాలం, శీతాకాలం, వేసవిలో నీటి మట్టం ఎంత



ఉంటుందో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అర్హులకు పక్కా ఇళ్లు, వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్లు అందించాలని, ముంపు మండలాల రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. 18 నుంచి 60 ఏళ్ల మహిళలకు హామీ ఇచ్చిన నెలకు రూ.1,500 పథకం అమలు చేసి, ఇప్పటివరకు బకాయి ఉన్న 26 నెలలకు రూ.39 వేలు చెల్లించాలని, నిరుద్యోగులకు రూ.3 వేల భృతి అందించాలని డిమాండ్ చేశారు. అచ్చుతాపురం వాగు ప్రాజెక్టు కాలువలకు మరమ్మతులు చేపట్టాలని, గుండాల నుంచి కూనవరం వరకు దెబ్బతిన్న రహదారిని పునర్నిర్మించాలని, ఆన్‌లైన్‌లో 1బీ నమోదు కాని రైతులకూ అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని కోరారు. డ్వాక్రా మహిళలకు 60 ఏళ్లు



నిండిన తర్వాత కూడా రుణాలు అందేలా చర్యలు తీసుకుని, 75 ఏళ్ల వరకు రుణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కందుకూరి స్వర్ణ, డివిజన్ కార్యదర్శి గుజ్జ మోహన్‌రావు, సహాయ కార్యదర్శి వాసం రాము, ఏటపాక మండల కార్యదర్శి ఎలిశాల నాగరాజు, కూనవరం మండల కార్యదర్శి లంబూ శ్రీనివాసరావు, వీఆర్‌పురం నాయకుడు కర్నాటి ఏసు, జుత్తుక సూర్యచంద్రరావు, చింతూరు మండల కార్యదర్శి తుర్రం మురళి, ఎస్కే రంజన్ తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాల నాటికి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు పూర్తి





- దిశా సమావేశంలో కేంద్ర పథకాల అమలుపై సమగ్ర సమీక్ష
- ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు:27:**కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమ అమలు, అర్హులైన లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించేందుకు దిశా జిల్లా అభివృద్ధి పర్యవేక్షణ కార్యాచరణ కమిటీ (దిశ)సమావేశాలను నిర్వహిస్తున్నట్లు రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు, దిశా కమిటీ చైర్‌పర్సన్ దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో తూర్పు గోదావరి జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం ఎంపీ శ్రీమతి దగ్గుబాటి పురంధేశ్వరి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తూర్పు గోదావరి జిల్లా జెడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ సీఈవో పి. జగదంబ, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు, కేంద్ర ప్రభుత్వ రైల్వే తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ,

కేంద్ర ప్రభుత్వ విధానాలు క్షేత్రస్థాయిలో అమలలో సమస్యలు, లోపాలు, ప్రజల ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు దిశా సమావేశాలు వేదికగా ఉపయోగపడుతున్నాయన్నారు. వ్యవసాయ రంగానికి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, సాయిల్ హెల్త్ కార్డులు పథకాల అమలుపై సమీక్షించినట్లు ఎంపీ తెలిపారు. రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలని సూచించారు.
కడియం పూల రైతులను రైతులుగా రిజిస్టర్ చేయాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఎంపీ దృష్టికి తీసుకురాగా, తగిన చర్యలు తీసుకోవా లని వ్యవసాయ శాఖ అధికారులను ఎంపీ ఆదేశించారు. పొగాకు పంటకు క్రాప్ ఇన్సూరెన్స్ అవసరమని ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు.

పుష్కరాలలో మౌలిక వసతులపై దృష్టి...
రాబోయే పుష్కరాలకు రాజమహేంద్రవరం, కొవ్వూరు తదితర ప్రాంతాల్లో కనెక్టివిటీ రోడ్లు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ పనులను వేగవంతం చేయాలని ఎంపీ అధికారులనుఆదేశించారు.
జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్లలో 13 ప్రాంతాల్లో సోలార్ లైట్లు ఏర్పాటు చేసినట్లు అధికారి తెలిపారు. గామన్ జంక్షన్ వద్ద ఎలివేటెడ్ కారిడార్ పనులు 25 శాతం పూర్తయ్యాయని, పుష్కరాల దృష్ట్యా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఇరువైపులా 10.5 మీటర్ల వెడల్పుతో సర్వీస్ రోడ్లు నిర్మిస్తున్నట్లు వివరించారు.
దివాన్ చెరువు నుంచి పొట్టిలంక వరకు సర్వీస్ రోడ్డు, బాక్స్ కల్వర్టు నిర్మాణంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి సూచించగా, తగిన చర్యలు తీసుకోవాలని అధికారు లను ఎంపీ ఆదేశించారు.

అడ్డుగా ఉన్న అనధికారిక విగ్రహాలు, కట్టడాలను సామరస్యపూర్వకంగా పక్కకు తరలించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా కోసం ప్రారంభించిన మెగా ప్రాజెక్టును పుష్కరాల లోపు పూర్తి చేసి గ్రామీణ ప్రజలకు నిరంతర మంచినీటి సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ రోడ్లను పంచాయతీరాజ్ శాఖ అభివృద్ధి చేయాలని, కేంద్రం నిధులను సద్వినియోగం చేయ లన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ పై సమగ్ర ప్రణాళిక రూపొందించి ఇంజనీరింగ్ విభాగం పనులు చేపట్టాలని ఆదేశించారు. పుష్కర ఘాట్ల అభివృద్ధి, ఫేస్ లిఫ్ట్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారుల నుఆదేశించారు.ఎర్రకాలువ బండ్ల బలోపే తానికి సమగ్ర డీపీఆర్ సిద్ధం చేయాలని సూచించారు.
డీఆర్‌డీఏ, నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణను విస్తరించాలని ఎంపీ సూచించారు. కంప్యూటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక రంగాల్లోనూ మహిళలకు శిక్షణ అందించాలని ఆదేశించారు. .

**రైల్వే స్టేషన్ పనులపై సమీక్ష...**
రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులపై దిశా సమావేశంలో సమీక్ష నిర్వహించారు. రైల్వే స్టేషన్ ఈస్ట్ సైడ్‌లో చేపడుతున్న ఐదు అంతస్తుల నిర్మాణంలో మూడు అంతస్తులు, వెస్ట్ సైడ్‌లో మూడు అంతస్తుల నిర్మాణంతో పాటు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు తదితర పనులను పుష్కరాలకి పూర్తి చేస్తామని రైల్వే అధికారులు తెలిపార న్నారు. జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ, తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి మూడో దిశా సమావేశమని తెలిపారు.
గత నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులను సమీ క్షించామన్నారు.ఈ సమా వేశంలో జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు , ప్రగతి, లక్ష్యాల సాధన, సమస్యలు చర్యలపై ప్రజెంటేషన్ల ద్వారా వివరించినట్లు తెలిపారు. .
శాసనసభ్యులు వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ, తమ నియోజకవర్గం తూర్పుగోదావరి జిల్లాలో విలీనం కావడంతో పరిధులపై స్పష్టత లేక కొన్ని అభివృద్ధి పనులు నిలిచిపోయాయని తెలిపారు. రెండు జిల్లాల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, పనులు జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని దిశా కమిటీ చైర్‌పర్సన్, అధికారులను కోరారు.
అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో సమస్యలను పరిష్కరించడంతో పాటు, ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫారసు చేసే ప్రతిపాదనలకు వైద్య ధ్రువపత్రాలను జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య ఖర్చులను అక్రమంగా పెంచి ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడే ఆసుపత్రి యాజమాన్యాలు, వైద్యులపై సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కోరారు.

## వై ఎం వి ఎ ఆక్రమిత స్థలం మున్సిపల్ కార్పొరేషన్ దే

- వైశ్య నాయకులు శ్రీఘాకొళాపు రూ.11లక్షలు ఇచ్చింది వాస్తవమే
- మీడియా సమావేశంలో మృత్యుంజయ సేవా సమితి నాయకులు కందకం శ్రీను



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 28:**
యంగ్ మెన్ వైశ్య అసోసియేషన్ (వై ఎం వి ఏ) ఆక్రమించుకున్న స్థలం వై ఎం వి ఏ,పోతుల వీరాస్వామి వ్యాయామ కళాశాలకు చెందినది కాదని, ఆ స్థలం మున్సిపల్ కార్పొరేషన్ దేనని మృత్యుంజయ సేవా సమితి నాయకులు , వైసిపి నాయకుడు పడాల శ్రీను (కందకం శ్రీను) స్పష్టం చేశారు. గత కొంతకాలంగా వై ఎం వి ఏ అక్రమణ స్థలంపై రెండు మూడు వర్గాల మధ్య వివాదాలు, ఆరోపణలు వస్తున్న క్రమంలో ఆయన మాట్లాడారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, 1960 దశకంలో వై ఎం విఏ హాలు
పక్కనే ఉన్న స్థలంలో సుమారు( 33 చ. గ.లు) తమ తండ్రి పడాల వెంకటేశ్వరరావు, ఒక ముస్లిం గురువు తో పాటు మరికొందరు మట్టి కుస్తీ శిక్షణ పొందే వారన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు రాష్ట్ర, జాతీయస్థాయిల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నరన్నారు. కాలక్రమంలో మట్టి కుస్తీలకు ఆదరణ లేక స్థలం ఖాళీగా ఉందదన్నారు.
ఆ ఖాళీ స్థలంలో షెడ్ వేసుకుని కొంతకాలం పాటు ముస్లిం గురువు భార్య నివాసం ఉండేదన్నారు.
ఈ స్థలం తమ తాత, ముత్తాతలదని, అది తమదేనని పోతుల వీరస్వామి పేరుతో ముందుకు వస్తున్న వారాధి వెంకటరమణ అనే వ్యక్తి కి స్థలానికి సంబంధమే లేదన్నారు. వై ఎం వీఏ హాల్ కార్యకలాపాలు విస్తృతం కావడంతో లిఫ్ట్ అవసరం ఏర్పడిందన్నారు. దాంతో ఆమెను ఖాళీ చేయించడానికి ఆర్యవైశ్య నాయకుడు శ్రీఘాకొళాపు శివరామ సుబ్రహ్మణ్యం తనకు రూ.11 లక్షల రూపాయలు ఇచ్చిన మాట వాస్తవమేనని, అందులో రూ. 2 లక్షల రూపాయలు ఆమెకు ఇచ్చి ఖాళీ చేయించామన్నారు. మిగతా రూ.9 లక్షల్లో
మృత్యుంజయ సేవా సమితి కి రూ.4 లక్షలు, శ్రీ శ్యామలమ్మ ఆలయ కమిటీకి రూ.5 లక్షలు శివరామం ఇచ్చినట్లు తెలిపారు. స్థలంతో సంబంధం లేనప్పుడు శివరామం మీకు ఎందుకు రూ.11 లక్షలు చెల్లించారని, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అంత పెద్ద మొత్తం ఆయన చెల్లించారా అని మీడియా ప్రశ్నలకు సమాధానం చెప్పక పోవడం విశేషం. ఈ సమావేశంలో ఆడప రాజు, నరేష్, కృష్ణ నాగేశ్వరరావు, వారాది హరి, జానీ, భాషా, అబ్బాయి తదితరులు పాల్గొన్నారు

## ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం బ్యాంకు ఖాతా లేని నిర్వాసితులకు ప్రత్యేక శిబిరాలు




**చింతూరు,పెన్ పవర్ ఆగస్టు 27:**పోలవరం ప్రాజెక్టు పునరావాస ప్యాకేజీ చెల్లింపుల కోసం బ్యాంకు ఖాతాలు లేని కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాల ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాల ప్రారంభ శిబిరాలు నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు అధికారి, ఐటీడీఏ చింతూరు తెలిపారు. సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ఆర్అండ్ఆర్ విభాగం సిబ్బంది, బ్యాంకు ప్రతినిధులు అందుబాటులో ఉండి కొత్త ఖాతాల ప్రారంభానికి సహకరిస్తారు. నిర్వాసితులు ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ ఫోన్, ఇతర అవసరమైన కేవైసీ పత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు. మండలాల వారీగా కూనవరం, ఎం. ప్రవీణ్ (8184948012), వీఆర్‌పురం కె. రామకృష్ణ (9948214414), చింతూరు కె. రాంబాబు (8185808257) లను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. జాబితాలో పేరున్న బ్యాంకు ఖాతాలు లేని నిర్వాసితులు ఆగస్టు 29లోపు కొత్త బ్యాంకు ఖాతా తెరిచి వివరాలను ఆర్అండ్ఆర్ సిబ్బందికి సమర్పించాలని కోరారు. గడువులోపు వివరాలు అందించకపోతే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లింపుల్లో జాప్యం జరిగే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారి హెచ్చరించారు.

## రాబోయే రోజుల్లో పార్టీ ని క్షేత్రస్థాయిలో బలోపేతంచేయాలి

బిజెపి జిల్లా కార్యవర్గ సమావేశం లో ఎంపీ పురందేశ్వరి పిలుపు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 27:**
బిజెపి జిల్లా అధ్యక్షులుపిక్కి నాగేంద్ర అధ్వర్యంలో బిజెపి జిల్లా కార్యవర్గ సమావేశం పార్టీ జిల్లా కార్యాలయం లో నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షులు ఎంపీ పురంధేశ్వరి, జాతీయ కార్యవర్గ సభ్యులు ఎం ఎల్ సి సోము వీర్రాజు , ఎం ఎల్ ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లాలో పార్టీ పరిస్థితిని సమీక్షించడంతో పాటు, రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.
ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత కేడర్ పై ఉందన్నారు. కార్యకర్తల అంకితభావం పార్టీకి ఎంతో బలాన్ని చేకూరుస్తున్నా యని, కలిసికట్టుగా పార్టీని విజయపథంలో నడిపిద్దా మన్నారు. ఈ సమావేశంలో ఇటీవలే జాతీయ ఉపాధ్యక్షురాలుగా ఎన్నికైన ఎంపీ శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరిని సాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, రేలంగి దేవి, బొమ్ముల దత్తు ఎమ్మెస్ కే రాజు, కురగంటి సతీష్, కాలేపు సత్య సాయిరాం, వీర వీరాంజనేయులు, మోహిని, స్వామి సూర్యకిరణ్ ,బండి సత్య ప్రసాద్, గుర్రాల వెంకట్రావు ,తన్నుద్ధి భాస్కరరావు, కందికొండ రమేష్ రవిశంకర్, కొయ్య వెంకటలక్ష్మి, యానాపు యేసు , శ్రీవిద్య ,తగరం సురేష్ బాబు, ఆకుల శ్రీధర్, శెట్టిపల్లి శివ నాగరాజు, తారట్ల చింతాలమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కడియం మినర్వా (ఇ.మీ) స్కూల్ లో సైబర్ నేరాలపై అవగాహన



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, ఆగస్టు 27:**కడియం మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని కడియం ఎస్సై బి . నాగ దుర్గా ప్రసాద్, జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారంనిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై , సైబర్ ల్యాబ్ సిబ్బంది విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు వంటి కీలకమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయంటూ వచ్చే పెట్టుబడి ఆఫర్లు, ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, లాటరీలు, బహుమతులు, కస్టమర్ కేర్ పేరుతో వచ్చే ఫోన్ కాల్స్ వంటి మోసపూరిత ప్రయత్నాలను నమ్మవద్దని హెచ్చరించారు. త్వరగా డబ్బు సంపాదించాలని ఆశపడి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని అనేక మంది ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు.వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమ వేదికల్లో అపరిచితులతో చాటింగ్ చేయడం, వారు పంపే లింకులు, యాప్‌లు, ఈ-మెయిల్స్‌ను క్లిక్ చేయడం వల్ల వ్యక్తిగత సమాచారం దొంగిలించే ప్రమాదం ఉందని విద్యార్థులకు అవగాహన కల్పించారు.సైబర్ మోసాలకు గురైన సందర్భంలో ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది పి. దుర్గాప్రసాద్ , అబ్దుల్ షౌకత్, స్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి




**వై రామవరం, పెన్ పవర్, ఆగస్టు 27 :** విధి నిర్వహణలో భాగంగా అక్రమాలను వెలుగులోనికి తీసుకు వస్తున్న జర్నలిస్టులపై దాడులను ఖండిస్తూ వై రామవరం విలేకరులు గురువారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పూసపాటిరేగ మండలానికి చెందిన విశాలాంధ్ర విలేఖరి గోవిందుపై రియల్ మాఫియా దాడి చేయడం హేయమైన చర్యని ఖండించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, రాజకీయ నాయకులు నిరోధక చర్యలు తీసుకోవాలని విలేకరులు డిమాండ్ చేశారు. ఫిర్యాదును వై రామవరం పోలీస్ స్టేషన్ రైటర్ కు అందించారు.

# 50వ వార్డులో ఇంటింటికి తెలుగుదేశం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 27**: నగరంలోని 50వ వార్డులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో ఇంటింటికీ వెళ్లి స్థానిక ప్రజలను కలుసుకున్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వారకి పార్టీ కార్యక్రమాలను వివరించారు.ప్రజలతో టీడీపీ శ్రేణులు వార్డు అభివృద్ధి, స్థానిక సమస్యలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాశీ నవీన్ కుమార్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ మరికుర్తి రవి యాదవ్, వార్డు కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగస్టు 27:**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పథకాల గురించి ప్రజలకు ఖుటమి నాయకులు వివరించారు. నాయకులు గణపతి వీర రాఘవులు ఆధ్వర్యంలో క్లస్టర్ పరిధి 114బూత్ లలో" రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు
ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. తెలుగుదేశం పార్టీపై ప్రజలు ఉంచుతున్న నమ్మకానికి, చూపిస్తున్న అభిమానానికి ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, టిడిపి సీనియర్ నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి రవణం రాము, తెలుగు యువత అధ్యక్షులు, జోగి కృష్ణ చైతన్య, బూత్, కన్వీనర్, మట్టపర్తి శ్రీనివాస్, నేలపూడి సత్యనారాయణ, మట్టపర్తి ఏసు తదితరులు పాల్గొన్నారుం

## నెల్లిపూడిలో ఉచిత పశు వైద్య శిబిరం ని ప్రారంభించిన మార్కెట్ యార్డ్ చైర్మన్ బద్ది మణి రామారావు.....





**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 27:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం మండలంలో నెల్లిపూడి గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్తిపాడు సౌజన్యం తో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ పశువైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ బద్ది మణి రామారావు చే ప్రారంభించ బడింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బద్ది రామారావు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత నెల్లిపూడి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని తలంచి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కావున రైతులందరూ సద్వినియోగ పరుచుకోవలసినదిగా కోరారు అలాగే శంఖవరం ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ రైతులు వర్షాభావ పరిస్థితులను తట్టుకునే విధంగా పశుగ్రాసాల సాగును చేపట్టాలని ప్రభుత్వం అందించే పశుగ్రాస విత్తనాలను పొలాలలో నాటుకొని పశుగ్రాస కొరతను నివారించ వలెనని కోరారు. ఈ పశువైద్య శిబిరంలో 68 పశువులకు గర్భకోస పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది మరియు 600కు పైగా గొర్రెలు మేకలకు బట్టల నివారణ మందు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం నాయకులు బద్ది రమణ మండల తెలుగుదేశం ప్రెసిడెంట్ దేవుళ్ళు, జనసేన నాయకులు తలపంటి బుజ్జి మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు. పశు వైద్యాధికారి డాక్టర్ కాకర్ల ప్రసాద్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

వైయస్సార్ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి జాలెం రాము



**గోకవరం పెన్ పవర్ ఆగష్టు 27** :-అసంఘటిత భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వైయస్సార్ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి జాలెం రాము డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమంకోసం పలు పథకాలు ప్రకటించినప్పటికీ ఐదునెలల గడుస్తున్న అమలులో పురోగతి లేదని కార్మిక నాయకుడు వైయస్సార్ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి జాలెం రాము విమర్శించారు. వివాహానికి రూ 20,000 డెలివరీ 20,000 సహజ మరణానికి 60,000 అంత్య క్రియలుకు 20,000 ప్రకటించిన పథకాలు కూడా కార్మికులకు అందడంలేదు అన్నారు. ఆన్లైన్ సేవల పేరుతో ప్రవేశపెట్టిన ఏపీ పోర్టల్ సరిగ్గా పని చేయక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మూడు నెలలుగా లేబర్ కార్డులు రెన్యువల్ నిలిచిపోయాయని ఈ సమస్యపై విన్నత పత్రం ఇచ్చిన ఇంతవరకు స్పందన లేదని 2018 వ సంవత్సరం పెండింగ్ లో ఉన్న సుమారు 36వేల క్లైమ్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బి ఓ సి కార్డులు రెన్యువల్స్ తక్షణమే అందించాలని కోరారు. మే నుంచి నిలిచిపోయిన క్లైమ్ లు విడుదల చేయడంతో పాటు సంక్షేమ బోర్డు నిధులను కార్మికులకే అందించాలని బోర్డులో సభ్యులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు టూల్ కిట్ లు పిల్లలకు స్కాలర్షిప్లు అందించాలని కోరారు. ప్రమాదంలో కార్మికుడు మృతి చెందితే పది లక్షలు సహజ మరణానికి రెండు లక్షలు పరిహారం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు .స్కిల్ డెవలప్మెంట్ పేరుతో కార్మికుల సొమ్ము వృధా చేయడం నిలిపివేయాలని జాలెం రాము సూచించారు.

## ఇండియా టుడే ర్యాంకింగ్ లో ఉద్యాన విశ్వవిద్యాలయాల కేటగిరీలో డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయానికి అగ్రస్థానం.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 27.**ప్రతిష్ఠాత్మక ఇండియా టుడే--ఎండీఆర్ఏ బెస్ట్ కాలేజెస్ సర్వే--2026 లో డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం దేశంలోని ఉద్యాన విశ్వవిద్యాలయాల విభాగంలో ప్రథమ స్థానాన్ని సాధించింది. అన్ని విభాగాలను కలిపి నిర్వహించిన జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో 32వ స్థానం దక్కించుకుంది మరియు ఆంధ్రప్రదేశ్ లోని విశ్వ విద్యాలయాలలో 3 స్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విద్యాసంస్థల విద్యా ప్రమాణాలు, పరిశోధన, బోధన, ప్రవేశాలు, ప్లేస్‌మెంట్లు, ఫీజులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్వహించిన ఈ ప్రతిష్ఠాత్మక సర్వేలో డా. వై యస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం సాధించిన ఈ ర్యాంకు రాష్ట్రానికి, విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా నిలిచింది .

విశ్వవిద్యాలయం సాధించిన ఈ ఘనతపై ఉప కులపతి డా. కట్టుపల్లి ధనుంజయరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "ఉద్యాన విద్య, వ్యవసాయ అనుబంధ రంగాల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిశోధనలు, రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విశ్వవిద్యాలయం చేపడుతోంది అని , ఈ కృషికి జాతీయ స్థాయిలో లభించిన గుర్తింపుగా ఈ ర్యాంకును భావిస్తున్నాము" అని అన్నారు.

విశ్వవిద్యాలయాన్ని జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లేందుకు భవిష్యత్తులోనూ సమష్టి కృషి కొనసాగుతుందని ఉపకులపతి తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి విశ్వవిద్యాలయ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల కు అభినందనలు తెలిపారు. వారి అంకితభావం, కృషి, పరిశోధనా దృక్పథం, విద్యా ప్రమాణాల పట్ల నిబద్ధతే ఈ విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కంబాలపాలెం లో లేగ దూడల ప్రదర్శన.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 27:** మండల పరిధి కంబాలపాలెం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన గురువారం నిర్వహించారు. జిల్లా పశు పశు గాణభివృద్ధి సభ్యులు డాక్టర్ చిక్కం బాలచంద్ర యోగీశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని స్థానిక కూటమి నాయకులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన ఒక సంవత్సరం లోపు వయస్సు గల 40 పెయ్య దూడలను రైతులు ప్రదర్శనలో పెట్టారు. ఈ ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన లేగదూడల రైతులకు డాక్టర్ యోగేశ్వర్, ఎన్డీఏ కూటమి నాయకులు బహుమతులు అందజేశారు. అలాగే 40 లేగ దూడలకు ఏలిక పాముల నివారణ మందును అందించారు.

ప్రదర్శనకు వచ్చిన అన్ని దూడలకు లివర్ టానిక్స్, మినరల్ బ్లాక్స్, మందులనువేసారు. ఈ కార్యక్రమం లో కొత్తపల్లి త్రిమూర్తులు,చింతలపాటి బుచ్చి అప్పలరాజు (బుజ్జి), కూటమి నాయకులు, పశువైద్య శస్త్రచికిత్స సహాయకులు డాక్టర్ ఈ సతీష్ కుమార్, డాక్టర్ సాయి కృష్ణ, వి ఎల్ ఓ సత్యనారాయణ, మండల పారా మెడికల్ సిబ్బంది , ఏలేశ్వరం మండలపరిధిలో సచివాలయ పశు వైద్య సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ ధాన్యం సేకరణకు ముందస్తు ఏర్పాట్లు



- రైతులు పండించిన ప్రతి గింజ మద్దతు ధరకు పారదర్శకంగా సేకరించాలి
- జేసీ అపూర్వ భరత్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 27:** జిల్లాలో ఖరీఫ్ 2026-27 సీజన్‌లో రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు పారదర్శకంగా సేకరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో పౌరసరఫరాల సంస్థ, పౌరసరఫరాల శాఖ, వ్యవసాయం, రవాణా, సహకార, లీగల్ మెట్రాలజీ, ఎఫ్‌సీఐ తదితర శాఖల అధికారులతో జేసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణను సజావుగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ ప్రక్రియలో పౌరసరఫరాలు, వ్యవసాయం, సహకార, రవాణా, తూనికలు--కొలతలు తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. జిల్లాలో 70,012 హెక్టార్లలో ఖరీఫ్ సాగు జరుగుతుండగా, ఇప్పటివరకు 50,824 హెక్టార్లలో క్రాప్ బుకింగ్ పూర్తయిందని జేసీ తెలిపారు. జిల్లాలోని 271 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియకు అవసరమైన తేమ శాతం నిర్ధారణ యంత్రాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. రైస్ మిల్లుల పరిధిలోని వే బ్రిడ్జిలపై తూనికల్లో అక్రమాలకు తావులేకుండా లీగల్ మెట్రాలజీ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

రైతులు పండించిన ధాన్యాన్ని తప్పనిసరిగా కనీస మద్దతు ధరకు విక్రయించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరపై ఇప్పటి నుంచే విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు విక్రయించిన ధాన్యానికి సకాలంలో బిల్లులు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జేసీ అపూర్వ భరత్ స్పష్టం చేశారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.ఆనందరావు,డీఎస్ఓ టి.ప్రసన్న లక్ష్మీదేవి,వ్యవసాయం,రవాణా, సహకార,లీగల్ మెట్రాలజీ,ఎఫ్‌సీఐ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చింతపల్లి నందుకు ఆర్దిక సహకారం అందించిన





- లలితమ్మ సేవా సంస్థ వ్యవస్థాపకురాలు
- యన్నపు లలిత

**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు 27:** వైద్యం చేయించుకొనేందుకు ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్న విషయం తెలియడంతో తమవంతు ఆర్థిక సహసయం అందించి సేవా స్ఫూర్తి ని వాడుకున్నారు. పి.గన్నవరం మండలం లంకల గన్నవరం చెందిన యన్నపు లలిత మదర్ తెరిసా సేవ స్ఫూర్తితో లలితమ్మ సేవా సంస్థను స్థాపించి గత పది సంవత్సరాలుగా ఎంతోమంది పేదలకు, వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సహాయం అందిస్తూ సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. పి. గన్నవరం పరిధిలోని చింతపల్లి వారి పేటకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చింతపల్లి నందు నిరుపేద. ఇద్దరు పిల్లలు కలరు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే గత సంవత్సర కాలం నుండి రెండు కిడ్నీలు పాడై డయాలసిస్ చేయించు కుంటున్నాడు. ఈ నేపద్యంలో తినడానికి తిండి లేక వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేక సతమతమవుతూ ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయాన్ని కొందరు వైసీపీ నాయకులు లంకల గన్నవరం లోని యన్నపు లలిత ఇంటి వద్దకు వచ్చి తెలియపరిచారు. సమస్య విన్న వెంటనే స్పందించిన యన్నపు లలిత గురువారం వైఎస్ఆర్సిపి నాయకులనుతో డయాలసిస్ వ్యాధిగ్రస్తుడు చింతపల్లి నందును పరామర్శించి ఓదార్చారు. కుటుంబం ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. 25 కిలోల బియ్యం,10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కిడ్నీలు ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించుకుంటే అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారని భరోసా ఇచ్చారు. భయపడవద్దని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్సిపి నాయకులు అడ్డగళ్ల వెంకట సాయి రామ్, దొమ్మేటి సూర్య, సబ్బితి చినబాబు, యాంద్ర నాగేశ్వరరావు, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, పులపర్తి ధర్మారావు, గెడ్డం బాబి, అడ్డగళ్ల శ్రీను, ముంగండ శ్రీనివాస్, మోసుగంటి శ్రీకృష్ణ, మానుకొండ శ్రీను, పల్లి నాగరాజు, కొల్లే గోపాలకృష్ణ, నేదునూరు మాజీ సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, పోతవరం గ్రామం మాజీ సర్పంచ్ వడలి కొండయ్య, మాజీ సర్పంచ్ గుత్తుల దాసు తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ సమావేశంలో

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు 17:** విజయవాడ వెలగపూడిలోని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ సమావేశంలో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన అంశాలపై కమిటీ సభ్యులతో కలిసి చర్చించారు. ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్మన్ ఇతర సభ్యులు పాల్గొన్నారు

# అతడే ఒక ధైర్యం

ఖాకీ చొక్కా రోడ్డుపై నిలబడితే.. ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తం పోలీసు







**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 27:** రోడ్డుపై ఖాకీ చొక్కా కనిపిస్తే అది కేవలం ఒక పోలీసు అధికారి కాదు..ఆపదలో ఉన్న వారికి భరోసా, భయంతో నిలిచిపోయిన వారికి ధైర్యం,అనుకోని ప్రమాదంలో చిక్కుకున్న వారికి రక్షణ కవచమని కాకినాడ జిల్లా పోలీసులు పేర్కొన్నారు. ప్రజలకు పోలీసు వ్యవస్థ మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో కాకినాడ జిల్లా పోలీసులు విజిబుల్ పోలీసింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు.ప్రధాన రహదారులు,కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థలు, మహిళలు,చిన్నారులు సంచరించే ప్రాంతాల్లో పోలీసులు నిత్యం విధులు నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందిస్తున్నారు.రోడ్డుపై విధుల్లో ఉన్న పోలీసులను చూసినప్పుడు మహిళలు,చిన్నారులు, వృద్ధులు మరింత ధైర్యంగా ప్రయాణం కొనసాగించగలుగుతున్నారని పోలీసులు తెలిపారు.అనుకోని ఆపద ఎదురైనప్పుడు మార్గమధ్యంలో కనిపించే ఖాకీ వారికి "మేమున్నాం" అనే నమ్మకాన్ని కల్పిస్తుందన్నారు.ఒక పోలీసు అక్కడ ఉండటం ఒక మహిళకు ధైర్యం.. ఒక చిన్నారికి రక్షణ.. ఒక వృద్ధుడికి ఆసరా.. ఒక ప్రయాణికుడికి భరోసా.. నేరస్తులకు సింహస్వప్నంగా ఉంటుందని పేర్కొన్నారు.విజిబుల్ పోలీసింగ్ కేవలం నేరాల నియంత్రణకే పరిమితం కాకుండా ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు, ముఖ్యంగా మహిళలు భయపడకుండా స్వేచ్ఛగా ప్రయాణించే వాతావరణాన్ని కల్పించేందుకు దోహదపడుతుందని తెలిపారు.మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఎటువంటి ఇబ్బందికి గురైనా సమీపంలోని పోలీసులను సంప్రదించాలని జిల్లా పోలీసులు సూచించారు.ప్రజల భద్రతే ప్రధాన బాధ్యతగా భావిస్తూ పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు.ఖాకీ అంటే కేవలం యూనిఫాం కాదు.. "మీకు మేమున్నాం" అనే భరోసా.ప్రజల భద్రత కోసం నిత్యం అప్రమత్తంగా ఉంటూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలవడమే కాకినాడ జిల్లా పోలీసుల లక్ష్యమని తెలిపారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు వాచ్‌డాగ్ కార్యక్రమాలు పటిష్టం





**ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలి**


**జేసీ అపూర్వ భరత్**

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 27:** ప్రభుత్వ భూములు, సహజ వనరుల పరిరక్షణకు వాచ్‌డాగ్ కమిటీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత పటిష్టంగా అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. పంచాయతీ,రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్ పరిధిలోని నీటి వనరులపై ఉన్న ఆక్రమణలను సమన్వయంతో గుర్తించి, నిబంధనల ప్రకారం వెంటనే తొలగించాలని సూచించారు.గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో ఏలేరు డివిజన్, ఈస్టన్ డివిజన్, జలవనరుల శాఖ ఇంజనీర్లు, జిల్లా పంచాయతీ అధికారులతో జేసీ వాచ్‌డాగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో వాచ్‌డాగ్ కమిటీ కార్యక్రమాల పురోగతిని ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ "ప్రభుత్వ భూమి ప్రజల ఆస్తి.. సహజ వనరులు భవిష్యత్ తరాల హక్కు" అనే మూలసూత్రంతో ప్రభుత్వ భూములు, సహజ వనరుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు వాచ్‌డాగ్ కమిటీని మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. నీటి వనరులపై ఆక్రమణలను డేటా ఆధారిత నిఘా, నిరంతర పర్యవేక్షణ ద్వారా గుర్తించి, వాటి తొలగింపునకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రభుత్వ భూములు, సహజ వనరులకు సంబంధించిన అక్రమాలను ప్రజలు నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ప్రత్యేక మొబైల్ యాప్, హెల్ప్‌లైన్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆక్రమణలను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులు వేగంగా స్పందించి వాటిని తొలగించడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.వాచ్‌డాగ్ కమిటీ ద్వారా ప్రభుత్వ భూములు, సహజ వనరులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని జేసీ స్పష్టం చేశారు. సెప్టెంబర్ మొదటి వారంలో ఏలేరు డివిజన్‌లోని ఆక్రమణలను, రెండో వారంలో గొల్లపాలెం, ఆర్యవటం ప్రాంతాల్లో, మూడో వారంలో తాళ్లరేవు, అన్నవరం పంచాయతీల్లోని ఆక్రమణలను పరిశీలించనున్నట్లు తెలిపారు.సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా. డి.తిప్పేనాయక్,డీపీఓ వి. రవికుమార్,ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు,డీఈ రవికుమార్,ఇతర జలవనరుల శాఖ ఇంజనీర్లు,కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్రేయపురం మండలంలో రాజకీయ ప్రకంపనలు..

# వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 27:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. పేరవరం గ్రామానికి చెందిన టీడీపీ మండల మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్ బెజవాడ హిమబిందు సతీష్ దంపతుల ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సన్నద్ధమయ్యారు.వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై, కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, సీనియర్ నాయకుడు రాయి వెంకటేశ్వరరావు నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు నాయకులు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 1వ తేదీ సాయంత్రం 4 గంటలకు పేరవరం గ్రామంలో భారీ చేరికల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. టీడీపీ, జనసేన పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.చేరికల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగిరెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ విభాగం ప్రధాన కార్యదర్శి మార్గాన గంగాధర్‌రావు, రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి చిలువూరి రామకృష్ణంరాజు, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి కొల్లి శ్యాంసన్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సాకా ప్రసన్నకుమార్, మండల అధ్యక్షుడు కనుమూరి శ్రీనివాసరాజు, ఆత్రేయపురం మండల ఎంపీపీ కుందా అన్నపూర్ణతో పాటు పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యం: మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి



**కరప,పెన్ పవర్,ఆగష్టు26:** రాష్ట్రంలో ప్రతి ఇంటా సుపరిపాలన అందిస్తూ, అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు తీగలిగేది ఒక్క కూటమి ప్రభుత్వంతోనేనని కాకినాడ రూరల్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం కరప మండలం పెద్దాపురప్పాడు గ్రామంలో "ఇంటింటికీ టీడీపీ" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను నేరుగా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఊపందుకున్న మౌలిక వసతుల కల్పన, సాధించిన ప్రగతిని వివరిస్తూ ముద్రించిన ప్రజా కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ?ఈ కార్యక్రమంలో అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, కూటమి పాలనలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, భవిష్యత్తులోనూ ఇదే రీతిలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ జడ్పీటీసీలు నులుకుర్తి వెంకటేశ్వరరావు, బుంగా సింహాద్రి, టిడిపి కాకినాడ పార్లమెంటు ఉపాధ్యక్షులు చంద్రు వెంకన్న రాయ చౌదరి, క్లస్టర్ ఇన్‌చార్జ్ మద్దూరి స్వామి, మాజీ వైస్ ఎంపీపీ గొల్లపల్లి ధనలక్ష్మి బుజ్జి, కరప మాజీ డిస్ట్రిబ్యూటరీ డైరెక్టర్ కోటగిరి మహేంద్ర బాబు, నీటి సంఘం ప్రెసిడెంట్ బిరద శ్రీనివాసరావు, గ్రామ ఎంపీటీసీ పబ్బినీడి పద్మావతి ప్రసాదరావు, పీఏసీఎస్ అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ మాజీ సర్పంచ్ బొండా సూర్యనారాయణ (చంటిబాబు) నాయకులు వాసిరెడ్డి చిట్టిబాబు, పోల్నాటి శ్రీను,పలివెల గాయత్రి, పులపకూర మహేష్, పంపన కన్నారావు, చాట్ర ఇమ్మానియేలు, పలివెల జానకి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# 48వ జాబ్ మేళాలో 23 మందికి ఉద్యోగాలు




**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 27:** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రతి వారం నిర్వహిస్తున్న జాబ్ మేళాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రామచంద్రపురం ఉపాధి భవన్‌లో గురువారం నిర్వహించిన 48వ జాబ్ మేళాలో 23 మంది అభ్యర్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇంటర్వ్యూల అనంతరం ఫాక్స్‌కాన్ కంపెనీకి 10 మంది,కియా కంపెనీకి నలుగురు,ఓరియంట్ కంపెనీకి ఐదుగురు,పెట్టి ఇంజనీరింగ్‌కు ఇద్దరు, హీరో కంపెనీకి ముగ్గురు ఎంపికయ్యారు. కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధి స్నేహ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు.ఎంపికైన అభ్యర్థులకు హెచ్‌ఆర్ స్నేహ నియామక పత్రాలు అందజేసి అభినందించారు.ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు తమకు ఉపాధి అవకాశాన్ని కల్పించిన మంత్రి వాసంశెట్టి సుభాష్,సత్యం వాసంశెట్టి,ఉపాధి అధినేత రామ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

# మిరాకిల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో...

**పేద దైవజనులకు ఉచితంగా సైకిళ్ళ పంపిణీ.**





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 27:** మిరాకిల్ మినిస్ట్రీస్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద దైవజనులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండల పరిధిలోని తిరుమాలి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ఏలేశ్వరం మండల అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి, ఏలేశ్వరం పిఎసిఎస్ అధ్యక్షుడు సూతి అప్పలరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మిరాకిల్ మినిస్ట్రీస్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో దైవ జనులు ప్రవీణ్ పాల్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ,సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానన్నారు.
అనంతరం సూతి అప్పలరాజు,పసల సూరిబాబు,చందువోలు రాజా,సూతి ప్రభాకర్‌తో కలిసి సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు.మినిస్ట్రీస్ అధినేత ప్రవీణ్ పాల్ ఆధ్వర్యంలో నిర్వహింపబడిన కార్యక్రమంలో తిరుమాలి గ్రామం లో 30 మంది దైవ జనులకు ఉచితంగా సైకిళ్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు సుంకర సత్యనారాయణ,దైవ సేవకులు జాన్ విల్సన్ బాబు,కుంపట్ల పాల్ ప్రసాద్,పి ప్రకాష్ పాల్,ఎస్ ఎలేజా,పి లలిత కుమారి,పి సంకీర్తన పాల్,ఏబీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# నగరిపై గురి...

**తిరుపతి, ఆగస్టు 27, పెన్ పవర్:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరి మున్సిపల్ ఎన్నికలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ) నాయకురాలు, మాజీ మంత్రి ఆర్కే రోజా కు ఈ ఎన్నికలు కీలకంగా మారే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె ఓటమి తర్వాత నగరి రాజకీయాల్లో పరిస్థితులు మారాయి. తెలుగుదేశం పార్టీ ( నుంచి గాలి భాను ప్రకాష్ నాయుడు ) విజయం సాధించడంతో నియోజకవర్గంలో కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడ్డాయి.అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను రోజా పెద్దగా పట్టించుకోనప్పటికీ, ఇప్పుడు జరగబోయే మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఆమె రాజకీయ ప్రభావానికి ఒక కొలమానంగా మారవచ్చని స్థానికంగా చర్చ సాగుతోంది. దీంతో నగరి మున్సిపాలిటీపై వైసీపీ ఎలా వ్యూహం రచిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఎమ్మెల్యే భాను ప్రకాష్ మాత్రం ఈ ఎన్నికలను తనకు వచ్చిన అవకాశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది.నగరి పట్టణంలోని ప్రతి వార్డులో టీడీపీ బలాన్ని పెంచేందుకు భాను ప్రకాష్ నాయుడు విస్తృతంగా పర్యటిస్తున్నారు. కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు స్థానిక ప్రజలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. ఇప్పటికే పరిష్కరించిన సమస్యలను ప్రజలకు వివరిస్తూ, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపై హామీలు ఇస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని మున్సిపల్ స్థాయిలోనూ పునరావృతం చేయాలన్న లక్ష్యంతో ఆయన ముందుకు వెళు _న్నట్లు తెలుస్తోంది.రోజాను లక్ష్యంగా చేసుకుని భాను వర్గం చేస్తున్న రాజకీయ విమర్శలు కూడా చర్చకు వస్తున్నాయి. ఆమె నియోజకవర్గానికి తరచూ రావడం లేదంటూ 'విజిటింగ్ లీడర్' అనే ప్రచారాన్ని టీడీపీ వర్గాలు తెరపైకి తెస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న అంశాన్ని కూడా ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించే అవకాశం ఉంది. గతంలో చోటుచేసుకున్న ఆడుదా వ్యవహారం కూడా రాజకీయంగా చర్చకు వస్తోందినగరిలో జనసేన కు కూడా కొంత ప్రభావం ఉంది.

అయినప్పటికీ టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం ఉండటం భాను ప్రకాష్‌కు అదనపు బలంగా మారే అవకాశం కనిపిస్తోంది. స్థానిక ఎన్నికల్లో ఎమ్మెల్యేలకు ఎక్కువ బాధ్యతలు అప్పగించిన పరిస్థితుల్లో మున్సిపల్ ఫలితం తన నాయకత్వానికి కూడా ప్రతిబింబంగా ఉంటుందని భావిస్తూ ఆయన మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.మరోవైపు రోజా మాత్రం ఇప్పటివరకు మున్సిపల్ ఎన్నికలపై పెద్దగా దృష్టి పెట్టలేదనే అభిప్రాయం ఉంది. నియోజకవర్గంలో

ఆమె కార్యక్రమాలు తక్కువగా కనిపించడం వైసీపీకి ఇబ్బందిగా మారే అవకాశముంది. దీనికి తోడు పార్టీలోని అంతర్గత విభేదాలు కూడా ఆమెకు సవాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరి మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ ఎంతవరకు తన పాత ప్రభావాన్ని నిలబెట్టుకుంటుందో, టీడీపీ కొత్త బలంతో ఎలాంటి ఫలితాన్ని సాధిస్తుందో చూడాలి. ఫలితం రోజా రాజకీయ భవిష్యత్తుపై, భాను ప్రకాష్ స్థానిక నాయకత్వంపై ప్రభావం చూపే అవకాశం ఉంది.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## ఉత్తరాంధ్రలో రియల్ జోరు

**విశాఖపట్టణం, ఆగస్టు 27, పెన్ పవర్:** ఉత్తరాంధ్ర పారిశ్రామిక కేంద్రమైన శ్రీకాకుళం జిల్లా పరిధిలోని పైడిభీమవరం, ఎచ్చెర్ల బెల్ట్‌లో స్థిరాస్తి వ్యాపారం మళ్లీ వేగం పుంజుకుంది. జాతీయ రహదారి అనుసంధానంతో ఉన్న ఈ కారిడార్‌లో ఫార్మా రంగానికి చెందిన ప్రముఖ కంపెనీల విస్తరణ పనులు ఊపందుకోవడంతో నివాస స్థలాలకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. పారిశ్రామిక వేత్తలు, కంపెనీల ఉద్యోగులతో పాటు స్థానిక ఇన్వెస్టర్లు ఈ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతుండటంతో లేఅవుట్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి.పైడిభీమవరం పారిశ్రామిక రంగానికి గుండెకాయ లాంటిది కావడంతో అక్కడ పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులు, టెక్నీషియన్లకు శాశ్వత నివాసాలు కల్పించే దిశగా ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థలు సరికొత్త వెంచర్లను అందుబాటులోకి తెస్తున్నాయి. వీటికి తోడు ఎచ్చెర్ల పరిసర ప్రాంతాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయంతో పాటు పలు ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు కొలువై ఉండటంతో ఈ ప్రాంతం ఎడ్యుకేషనల్ అండ్ ఇండస్ట్రియల్ హబ్‌గా రూపాంతరం చెందింది. ఈ విద్యా, పారిశ్రామిక వాతావరణమే ఇక్కడ హౌసింగ్ లేఅవుట్ల విక్రయాలు పుంజుకోవడానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది.మరొకవైపు విశాఖపట్నం-భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ కారిడార్ ప్రభావం శ్రీకాకుళం జిల్లా సరిహద్దుల వరకు విస్తరించడంతో ఇక్కడ భూముల విలువలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో జాతీయ రహదారికి ఇరువైపులా వీఆర్డీఎ అనుమతులు పొందిన లేఅవుట్లు పెద్ద ఎత్తున రూపుదిద్దుకుంటున్నాయి. తక్కువ ధరకే ప్లాట్లు దొరకడం, భవిష్యత్తులో మంచి రాబడి ఇచ్చే అవకాశం ఉండటంతో మధ్యతరగతి గృహ కొనుగోలుదారులు ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేసేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు.ముగింపుగా చూస్తే, పైడిభీమవరం-ఎచ్చెర్ల పారిశ్రామిక కారిడార్ శ్రీకాకుళం జిల్లాలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న స్థిరాస్తి కేంద్రంగా మారుతోంది. ప్రభుత్వం కూడా ఈ కారిడార్‌లో రవాణా వసతులు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తుండటంతో రాబోయే రోజుల్లో ఇక్కడ నివాస గృహాల నిర్మాణాలు మరింత ఊపందుకుంటాయని, ఇది జిల్లా ఆర్థిక పురోగతికి మరింత తోడ్పడుతుందని స్థానిక స్థిరాస్తి నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## శ్రీశైలం దేవస్థానంలో భారీ ప్రక్షాళన..

**కర్నూలు, ఆగస్టు 27, పెన్ పవర్:** :శ్రీశైలం దేవస్థానంలో వరుస వివాదాల నేపథ్యంలో భారీ ప్రక్షాళన ప్రారంభమైంది. పరిపాలనలో సమర్థత, పారదర్శకత కోసం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు 37 మంది ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పులు దేవస్థానం దైనందిన కార్యకలాపాల్లో మెరుగైన సమన్వయాన్ని తీసుకువస్తాయని అంచనా. నూతన స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.నంద్యాల జిల్లా శ్రీశైలం దేవస్థానంలో వరుస వివాదాల నేపథ్యంలో భారీ స్థాయిలో అంతర్గత బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. పరిపాలనలో మార్పులు, విధుల నిర్వహణలో సమన్వయం కోసం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు 37 మంది ఉద్యోగులను స్థానికంగా అంతర్గత బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పర్యవేక్షణ స్థాయి అధికారి నుంచి అటెండర్, హెల్పర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వరకు వివిధ కేటగిరీలకు చెందిన సిబ్బంది ఈ బదిలీల్లో ఉన్నారు.దేవస్థానం పరిపాలన సౌలభ్యం, విధుల సమర్థవంతమైన నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఈ అంతర్గత బదిలీలు చేపట్టినట్లు ఈఓ శ్రీనివాసరావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఇతర విభాగాలు, స్థానాల్లోకి మార్చడంతో పరిపాలనా వ్యవస్థలో కొత్త సమీకరణాలు చోటుచేసుకోనున్నాయి.బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే సంబంధిత ఉద్యోగులు ప్రస్తుతం నిర్వహిస్తున్న విధుల నుంచి రిలీవ్ అయి, ఉత్తర్వుల్లో కేటాయించిన నూతన స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఈఓ స్పష్టం చేశారు. ఉద్యోగుల విధుల మార్పు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని అధికార యంత్రాంగం ఆదేశించింది.ఇటీవల శ్రీశైలం దేవస్థానంలో పలు అంశాలు వివాదాలకు దారితీసిన నేపథ్యంలో తాజా బదిలీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈఓ శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధతో ఈ బదిలీల ప్రక్రియను నిర్వహించినట్లు ఉద్యోగుల వర్గాల్లో సమాచారం వినిపిస్తోంది. మొత్తంగా 37 మంది ఉద్యోగుల స్థానిక అంతర్గత బదిలీలతో శ్రీశైలం దేవస్థానంలో పరిపాలనా వ్యవస్థలో మార్పులు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ మార్పుల అనంతరం దేవస్థానం రోజువారీ పరిపాలన, ఉద్యోగుల విధుల నిర్వహణలో మరింత సమన్వయం ఏర్పడుతుందా అన్నది వేచి చూడాల్సి ఉంది..!

## కొత్త దనం లేని జగన్ ప్రెస్ మీట్

**విజయవాడ, ఆగస్టు 27, పెన్ పవర్:** :వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి వారానికి ఒక్కసారి ప్రెస్ మీట్ పెడుతున్నారు. అయితే స్వల్ప వ్యవధిలో ఇలా ప్రెస్ మీట్ పెడుతుండడంతో పెద్దగా ఆసక్తికరమైన అంశాలు ఆయన మాట్లాడలేకపోతున్నారు. కనీసం నెలకోసారి ఇలా ప్రెస్ మీట్ పెడితే కొంత కొత్తదనం ఉండేది. పార్టీ నేతలతో ముందురోజు మాట్లాడుతున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి వారానికి ఒక్కసారి ప్రెస్ మీట్ పెడుతున్నారు. అయితే స్వల్ప వ్యవధిలో ఇలా ప్రెస్ మీట్ పెడుతుండడంతో పెద్దగా ఆసక్తికరమైన అంశాలు ఆయన మాట్లాడలేకపోతున్నారు. కనీసం నెలకోసారి ఇలా ప్రెస్ మీట్ పెడితే కొంత కొత్తదనం ఉండేది. పార్టీ నేతలతో ముందురోజు మాట్లాడుతున్నారు. ఆ వీడియోలు బయటకు వస్తున్నాయి. ఆ తరువాత రోజు ప్రెస్ మీట్ పెట్టుకుని కొన్ని రకాల స్క్రిప్టులను చూసి మాట్లాడుతున్నారు. అందులో కొత్తదనం ఏమీ కనిపించడం లేదు. అటు తిరిగి ఇటు తిరిగి చంద్రబాబు ప్రభుత్వాన్ని తప్పు పట్టడం.. అవి తమ హయాంలోనే బాగా అమలు చేశామని చెప్పడం వంటివి మాత్రమే జరుగుతున్నాయి. ఈ వారాంతపు ప్రెస్ మీట్ లో కూడా అదే పరిస్థితి కనిపించింది.బీసీ రిజర్వేషన్ల అంశంపై జగన్మోహన్ రెడ్డి మరోసారి రాజకీయ విమర్శలు చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో రెండు డిప్యూటీ సీఎం పదవులతో పాటు కేబినెట్ లోని 25 మందిలో 11 మంది బీసీలకు ఇచ్చామని గుర్తు చేశారు. 40 శాతం మంత్రి పదవులకు వారికి కేటాయించామని ప్రస్తావించారు. అప్పట్లోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధపడితే కోర్టుల ద్వారా చంద్రబాబు అడ్డుకున్నారంటూ చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న కోర్టు తీర్పులను ప్రస్తావిస్తూ.. కూటమి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పేరుతో గ్రామాలకు దిగుతోందని ఆరోపించారు. అయితే ఇప్పుడు న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి బీసీ రిజర్వేషన్లు 34% కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దానిని స్వాగతించాల్సింది పోయి గతంలో తాను గొప్పగా చేశానని చెప్పుకునే ప్రయత్నం చేశారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఎలా నడుచుకుంది బలహీన వర్గాలకు తెలుసు.జగన్మోహన్ రెడ్డి మీడియా సమావేశాలు అంటేనే ముఖ్యంగా మీడియా ప్రతినిధులకు ఆసక్తి తగ్గిపోయింది. మెయిన్ మీడియా కంటే సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లకు, రీల్స్ లో, ఇన్స్టాగ్రామ్ లో ఉన్నవారికి ఆసక్తి. ఇప్పుడు జగన్ చేసే వ్యాఖ్యలకు.. ఆయన హయాంలో జరిగిన పరిణామాలను జత పోలుస్తూ మీమ్స్ ఓ రేంజ్ లో వేసుకుంటారు. సోషల్ మీడియా తెరిస్తే అదే పనిగా జగన్ పైనే రీల్స్ కనబడుతూ ఉంటాయి. అందుకే వారాంతపు మీడియా సమావేశాలు మాత్రం బోర్ కొడుతున్నాయి. రాతపూర్వక స్క్రిప్టులు చదవడం తప్ప ప్రజలకు కొత్తగా చెప్పేదేమీ లేకుండా పోతోంది. అది కూడా సొంత అనుబంధ మీడియా ఛానల్ లైవ్ కవరేజ్ ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోతోంది. జగన్ మీడియా సమావేశాన్ని జనాలు లైట్ తీసుకుంటున్నారు. ఆయన చెప్పిన దాంట్లో విశ్వసనీయత కంటే మరో కోణంలో వెతుకులాట ఎక్కువగా కనిపిస్తోంది. ఇక తెలుసుకోవాల్సింది ఆయన మాత్రమే.

# హిందూ సెంటిమెంట్ కు చోటుందా

**నెల్లూరు, ఆగస్టు 27, పెన్ పవర్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఎంపీ పదవికి రాజీనామా చేసిన తర్వాత రాజకీయాలకు కొంతకాలం దూరంగా ఉన్న వి.విజయసాయిరెడ్డి క్యాంపు మార్చి, సరికొత్త రాజకీయ పార్టీ పెడుతున్నట్లు ఆకస్మికంగా ప్రకటించడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. అయితే, పార్టీ స్థాపన కంటే ఎక్కువగా ఆయన ఎంచుకున్న హిందూత్వ ఎజెండా, సామాజిక మతపరమైన అంశాలు ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా కాకినాడ లవ్ జిహాద్ ఆరోపణల వ్యవహారం, సాధిక్ ఖాన్ అంశంపై పదే పదే మాట్లాడటం , ఏపీలో మత మార్పిడుల నిరోధక చట్టం తేవాలని కోరడం ద్వారా తన నూతన పొలిటికల్ లైన్ హార్డ్ కోర్ హిందుత్వ అని విజయసాయిరెడ్డి స్పష్టమైన సంకేతాలిచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే.. ఉత్తరాది రాష్ట్రాలు లేదా పక్కనే ఉన్న కర్ణాటక మాదిరిగా మతపరమైన సమీకరణాలు , పోలరైజేషన్ఓటు బ్యాంకుగా మారిన దాఖలాలు లేవు . ఉమ్మడి ఏపీ నుంచి నేటి వరకు ఇక్కడ రాజకీయం అంతా కుల సమీకరణాలు, సంక్షేమ పథకాలు, స్థానిక అభివృద్ధి , బలమైన ప్రాంతీయ నాయకత్వాల చుట్టూనే తిరిగింది. బీజేపీ కూడా ఏపీలో సుదీర్ఘకాలంగా ఉనికిలో ఉన్నప్పటికీ, ఒంటరిగా మత ఆధారిత ఓట్లతో సక్సెస్ కాలేకపోయింది. అందుకే విజయసాయిరెడ్డి తెరపైకి తెచ్చిన లవ్ జిహాద్ , మత మార్పిడుల కార్డు ఆంధ్రా నేలపై ఎంతవరకు ఫలితాన్నిస్తుందనేది ప్రధాన ప్రశ్న.ఏపీ ఓటర్లు ఎప్పుడూ కుల ప్రాతిపదికన, సంక్షేమ ఆధారంగా ఓటు వేయడానికి ప్రాధాన్యతనిచ్చారు తప్ప.. తీవ్రమైన మతపరమైన ఎజెండాలను స్వీకరించలేదనడానికి గత ఎన్నికల ఫలితాలే ఉదాహరణ. విజయసాయిరెడ్డి ఈ వ్యూహాన్ని ఎంచుకోవడం వెనుక బలమైన రాజకీయ అంశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. వైఎస్సార్సీపీ మైనారిటీలు, క్రిస్టియన్ల వైపు ఆకర్షితమైందనే టాక్ ఉన్నందున .. అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కూడా మైనారిటీ ఓట్లను కోల్పోకూడదనే భయంతో లవ్ జిహాద్ వంటి సున్నితమైన అంశాలపై మాట్లాడటానికి వెనుకాడుతోందని ఆయన బహిరంగంగానే ఆరోపించారు. ఈ రెండు ప్రధాన వర్గాల మధ్య ఖాళీగా ఉన్న కట్టర్ హిందూ ఓటు బ్యాంకు ను టార్గెట్ చేయడం ద్వారా, తన కొత్త పార్టీకి ఒక ప్రత్యేకమైన గుర్తింపు సాధించవచ్చని విజయసాయిరెడ్డి భావిస్తున్నారని అనుకోవచ్చు. అయితే, ఈ ప్రయత్నం సక్సెస్ కావడానికి తీవ్రమైన ప్రతిబంధకాలు ఉన్నాయి. విజయసాయిరెడ్డి గత దశాబ్దకాలంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అత్యంత ఆప్తుడిగా, ఆర్థిక, వ్యూహాత్మక వ్యవహారాల పర్యవేక్షకుడిగా ప్రజలకు పరిచయం. అప్పట్లో సంక్షేమ సిద్ధాంతాలను సమర్థించిన ఆయన, ఒక్కసారిగా హిందూత్వ నేత గా అవతారం ఎత్తితే ఓటర్లు ఎంతవరకు విశ్వసిస్తారనేది అసలు ప్రశ్న. పైగా, క్షేత్రస్థాయిలో పార్టీకి కేడర్ బలమైన ఆర్గనైజేషనల్ నెట్‌వర్క్ లేకుండా కేవలం మీడియా విమర్శలు, ఎక్స్ పోస్టులతో తీవ్రవాదాత్మక ఎజెండాను ఓట్లుగా మార్చడం దాదాపు అసాధ్యం.మరో కోణంలో చూస్తే, విజయసాయిరెడ్డి వేస్తున్న ఈ మతపరమైన కార్డు ఓట్ల సాధన కోసం కాకుండా.. రాజకీయంగా తన ఉనికిని కాపాడుకోవడానికి , ప్రధాన పార్టీలను డిఫెన్స్‌లో పడేయడానికి వేసిన ఎత్తుగడ కావచ్చునని అనుకోవచ్చు. అధికార కూటమిపై విమర్శలు చేస్తూనే, వైఎస్సార్సీపీ ఓటు బ్యాంకును దెబ్బతీయడానికి లేదా నేషనల్ లెవల్లో ఉండే సిద్ధాంతపరమైన మద్దతును పొందేందుకు ఈ వ్యూహం ఉపకరిస్తుందని భావిస్తుండవచ్చు. ఆంధ్రప్రదేశ్ వాతావరణంలో ఉత్తరాది తరహా రైట్ వింగ్ రాజకీయం పనిచేయడం అత్యంత కష్టం. స్థానిక సమస్యలు, రైతులు, నిరుద్యోగం, రాజధాని నిర్మాణం వంటి ప్రధాన అంశాలను పక్కనపెట్టి కేవలం ముస్లింలు, క్రిస్టియన్లను బూచిగా చూపే రాజకీయాలను నమ్ముకుంటే.. విజయసాయిరెడ్డి కొత్త పార్టీ పరిమిత ప్రభావానికే పరిమితమయ్యే ప్రమాదం ఉంది.

# జోగిని తలంటిన అధిష్టానం



**విజయవాడ, ఆగస్టు 27, పెన్ పవర్:** మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ సీనియర్ నేత జోగి రమేష్ కుటుంబ వివాదం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. కుటుంబ కలహాలను, వైవాహిక సమస్యలను నేరుగా పార్టీ ఆఫీసులో ప్రెస్ మీట్ ద్వారా బయటపెట్టి, దానికి రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేయడంపై వైఎస్సార్సీపీ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు చెబుతున్నారు. వ్యక్తిగత తప్పులను లేదా కుటుంబ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పార్టీ ప్లాట్‌ఫామ్‌ను వాడుకోవడం వల్ల వైఎస్సార్సీపీ ఇమేజ్ తీవ్రంగా దెబ్బతింటోందని తాడేపల్లి వర్గాలు భావిస్తున్నాయి. వివాదం ముదిరి జోగి రమేష్ కోడలు మేఘన స్వయంగా మీడి యా ముందుకు వచ్చి మాట్లాడటంతో ఈ వ్యవహారం మరింత సున్నితంగా మారింది. అత్తారింట్లో తనకు జరిగిన అన్యా యాన్ని, వేధింపులను వివరిస్తూనే.. న్యాయం కోసం సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసినా ఫలితం లేకపోయిందని, జగన్ మోహన్ రెడ్డిని కలవడానికి కూడా అవకాశం దక్కలేదని ఆమె బహిరంగంగా వెల్లడించడం పార్టీకి మింగుడుపడటం లేదు. సమాజంలోనూ, చట్టపరంగానూ ఇలాంటి సున్నితమైన కుటుంబ వ్యవహారాల్లో సాధారణంగా బాధితురాలిగా నిలిచే మహిళల వైపే ప్రజా సానుభూతి ఎక్కువగా ఉంటుంది. పైగా, బయటపడిన వీడియోలు కొన్నే, అసలు ఆధారాలు ఇంకా చాలా ఉన్నాయి అని మేఘన హెచ్చరించడంతో ఇది పార్టీకి మరింత డ్యామేజ్ తెచ్చిపెడు తుందనే భయం వైఎస్సార్సీపీలో మొదలైంది.ఆరోగ్యపరమైన, వైవాహికపరమైన వైఫల్యాలు తెలిసి కూడా పెళ్లి చేసి జీవితాన్ని నాశనం చేశారనే ఆరోపణలతో పాటు, మత విశ్వాసాలు, కట్న వేధింపుల వ్యవహారాలను కూడా బయటకు లాగడం వల్ల ప్రతిపక్షాలకు మంచి రాజకీయ అస్త్రం దొరికినట్లయింది. ఓవైపు జగన్ సహా పార్టీ కీలక నేతల పేర్లను ఈ వివాదంలోకి లాగడం, మరోవైపు మతపరమైన అంశాలు ప్రజల్లోకి వెళ్లడం పార్టీ సాంప్రదాయ ఓటు బ్యాంకుపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. అందుకే జోగి తీరుపై జగన్ అసహనంతో ఉన్నట్లుగా చెబుతున్నారు.ఈ పరిణామాలన్నింటినీ తీవ్రంగా పరిగణించిన వైఎస్సార్సీపీ నాయకత్వం.. జోగి రమేష్‌ను హెచ్చరించినట్లు సమాచారం. వ్యక్తిగత లే, కుటుంబ సంక్షోభాలకు వైఎస్సార్సీపీకి చుట్టవద్దని న, పార్టీ పేరును ఈ వ్యవహారంలోకి లాగవద్దని తాడేపల్లి ప్యాలెస్ నుంచి కఠిన ఆదేశాలు వెళ్లినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. లీగల్‌గానూ, వ్యక్తిగతంగానూ తేల్చుకోవాల్సిన సమస్యలను రాజకీయంగా మార్చవద్దని చెప్పినట్లుగా తెలుస్తోంది. వీలైనంత త్వరగా వివాదాన్ని ముగించుకోవాలని ఆదేశించినట్లుగా చెబుతున్నారు

# వెలిగొండ ప్రాజెక్టు అడుగులు

**ఒంగోలు, ఆగస్టు 27, పెన్ పవర్:** ప్రకాశం జిల్లా ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. మూడు దశాబ్దాల క్రితం తానే శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఇప్పుడు ముఖ్యమంత్రిగా తానే ప్రారంభించే అవకాశం రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రజలతో పంచుకున్నారు.1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన విషయాన్ని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. అప్పట్లో ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సాగునీటి ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. అయితే వివిధ కారణాలతో పనులు సుదీర్ఘకాలం కొనసాగాయి. ఎన్నో అడ్డంకులు ఎదురైనా ప్రాజెక్టును పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగామని సీఎం పేర్కొన్నారు.ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ పనులను అధికారికంగా ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు 30 ఏళ్ల క్రితం వేసిన పునాదికి ఇప్పుడు ఫలితం కనిపించడం తనకు ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తోందని చంద్రబాబు అన్నారు. తన సంకల్పం నెరవేరుతున్న ఈ సందర్భాన్ని ఒక గొప్ప అనుభవంగా ఆయన అభివర్ణించారు. దీనికి సంబంధించిన 1996 నాటి ఫొటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు.వెలిగొండ మొదటి దశ పూర్తవడంతో ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో సాగునీటి పరిస్థితుల్లో గణనీయమైన మార్పు వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దశ ద్వారా సుమారు 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉంది. దీంతో వర్షాలపై ఆధారపడే రైతులకు ఎంతో ఊరట లభించనుంది. వ్యవసాయానికి నీటి లభ్యత పెరగడంతో పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు కూడా మెరుగుపడే అవకాశం ఉంది.తాగునీటి విషయంలోనూ ఈ ప్రాజెక్టు కీలక ప్రయోజనాన్ని అందించనుంది. సుమారు నాలుగు లక్షల మంది ప్రజలకు తాగునీటి అవసరాలను

తీర్చేందుకు ప్రాజెక్టు ఉపయోగపడనుంది. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 10.7 టీఎంసీల కృష్ణా వరద జలాలను నల్లమలసాగర్ రిజర్వాయర్‌కు తరలించేందుకు తొలి దశ మార్గం సుగమం చేస్తుంది.ప్రకాశం, నెల్లూరు , కడప జిల్లాల్లోని ఫ్లోరైడ్ ప్రభావిత, కరవు ప్రాంతాలకు సురక్షితమైన తాగునీటిని అందించడంలో కూడా వెలిగొండ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. భూములు ఇచ్చిన రైతులకు విడతల వారీగా పరిహారం అందించామని చంద్రబాబు తెలిపారు. గతంలో ప్రాజెక్టు పూర్తికాకుండానే పూర్తయినట్లు ప్రచారం చేశారని ఆయన విమర్శించారు. ఇప్పుడు నిజంగా పనులను పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనం అందించడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది. మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించే ఈ ప్రాజెక్టు ప్రారంభం ప్రకాశం జిల్లా అభివృద్ధిలో కీలక మలుపుగా నిలిచే అవకాశం ఉంది.

## భారత్ విజయానికి అడ్డుగోడలా దినుష..

# రెండో టెస్టు డ్రా.. గిల్ సేనదే సిరీస్

- ఫాలో ఆన్ ఆడినా అద్భుత పోరాటంతో రెండో టెస్టును డ్రా చేసుకున్న శ్రీలంక
- అజేయ సెంచరీతో జట్టును ఆదుకున్న యువ కెరటం సోనల్ దినుష
- తొలి ఇన్నింగ్స్‌లో పడిక్కల్, ధ్రువ్ జురెల్ శతకాలతో భారత్ భారీ స్కోరు
- బౌలర్లకు సహకరించని పిచ్‌పై లంక బ్యాటర్ల అద్వితీయ నిలకడ
- ఈ సిరీస్‌లో మూడు సెంచరీలతో దినుష, 16 వికెట్లతో మానవ్ సుతార్ టాప్ పెర్ఫార్మర్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక యువ బ్యాటర్ సోనల్ దినుష అద్భుతమైన ప్రతిఘటనతో భారత్ విజయానికి అడ్డుగోడలా నిలిచాడు. ఓటమి అంచున నిలిచిన జట్టును తన వీరోచిత సెంచరీతో ఆదుకుని, రెండో టెస్టును డ్రాగా ముగించడంలో కీలక పాత్ర పోషించాడు. ఫాలో ఆన్‌లో రెండో ఇన్నింగ్స్ ఆడిన శ్రీలంక, ఓటమి ఖాయమనుకున్న దశలో దినుష (133 నాటౌట్) అసాధారణ పోరాటపటిమతో భారత్ కు సవాలుగా నిలిచాడు. అతనికి ఇతర బ్యాటర్లు చక్కటి సహకారం అందించడంతో, కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలుపు ఆశలు గల్లంతయ్యాయి. మ్యాచ్ చివరి రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 429 పరుగులు చేసింది. అప్పటికే లంక ఆధిక్యం 216 పరుగులకు చేరింది. ఇవాళ ఆటకు చివరి రోజు కాగా, టీమిండియా గెలిచే అవకాశం లేకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అద్భుతమైన ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను కాపాడుకున్న సోనల్ దినుషను భారత ఆటగాళ్లు, కోచ్ గౌతమ్ గంభీర్ ప్రత్యేకంగా అభినందించారు.

**ఫాలో ఆన్‌లో లంక పోరాటం**

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్, తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 503 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. దేవదత్ పడిక్కల్ (117), ధ్రువ్ జురెల్ (115) సెంచరీలతో కదం తొక్కగా, యశస్వి జైస్వాల్ (45), శుభ్‌మన్ గిల్ (50), రిషభ్ పంత్ (63) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక 290 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్ల ధాటికి లంక బ్యాటర్లు చేతులెత్తేయగా, సోనల్ దినుష (103), పసిందు సూరియబండార (80) మాత్రమే రాణించారు. దీంతో భారత్‌కు 213 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. భారీ ఆధిక్యంతో శ్రీలంకను ఫాలో ఆన్‌కు ఆహ్వానించిన భారత్‌కు ఆతిథ్య జట్టు ఊహించని షాక్ ఇచ్చింది. రెండో ఇన్నింగ్స్‌లో లంక బ్యాటర్లు అద్భుతమైన పోరాటాన్ని ప్రదర్శించారు. పసిందు సూరియబండార (92), కమిందు మెండిస్ (55) రాణించగా, సోనల్ దినుష మరోసారి శతకంతో కదంతొక్కాడు. ఈ సిరీస్‌లో అతనికి ఇది మూడో సెంచరీ కావడం విశేషం. దినుషకు కేశర నువంత (46) తోడవడంతో లంక ఓటమి నుంచి గట్టెక్కింది. లంక టెయిలెండర్లు దాదాపు 90 ఓవర్ల పాటు క్రీజులో నిలబడి భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. బ్యాటింగ్‌కు పూర్తిగా అనుకూలించిన పిచ్‌పై భారత బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు. భారత బౌలర్లలో ఈ సిరీస్ మొత్తం మీద మానవ్ సుతార్ 16 వికెట్లతో అగ్రస్థానంలో నిలవగా, లంక బౌలర్లలో అసిత్ ఫెర్నాండో 10 వికెట్లు పడగొట్టాడు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది.

# తండ్రుల బాటలోనే.. భారత అండర్-19 జట్టులోకి సెహ్వాగ్, ద్రవిడ్ కుమారులు

- ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఆర్యవీర్ సెహ్వాగ్ ఎంపిక
- అన్వయ్ ద్రవిడ్‌కు భారత అండర్-19 జట్టులో చోటు
- సెప్టెంబర్ 18న తొలి వన్డే
- 3 వన్డేలకు రాజ్‌కోట్ ఆతిథ్యం
- వన్డే కెప్టెన్‌గా లక్ష్య రైచందాని ఎంపిక





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ దిగ్గజాలు విరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్ వారసులు మరోసారి వార్తల్లో నిలిచారు. ఆస్ట్రేలియా అండర్-19తో జరగనున్న సిరీస్‌కు భారత జట్టులో ఆర్యవీర్ సెహ్వాగ్, అన్వయ్ ద్రవిడ్‌కు చోటు దక్కింది. భారత్-ఆస్ట్రేలియా అండర్-19 జట్ల మధ్య మూడు వన్డేలు జరగనున్నాయి. సెప్టెంబర్ 18, 21, 23 తేదీల్లో రాజ్‌కోట్‌లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆ తర్వాత నాలుగు రోజుల మ్యాచ్‌లు రెండు ఉంటాయి. సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు రాజ్‌కోట్‌లో తొలి మ్యాచ్ జరుగుతుంది. అక్టోబర్ 5 నుంచి 8 వరకు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం 'బి' గ్రౌండ్‌లో రెండో మ్యాచ్ ఉంటుంది. వన్డే జట్టుకు లక్ష్య రైచందాని కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. యశ్వర్ధన్ చౌహాన్ వైస్ కెప్టెన్‌గా ఉంటాడు. రెడ్‌బాల్ మ్యాచ్‌లకు చౌహాన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. రైచందాని వైస్ కెప్టెన్‌గా కొనసాగుతాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ ప్రస్తుతం ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వెస్ట్ ఢిల్లీ లయన్స్‌కు ఆడుతున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడాడు. అన్వయ్ ద్రవిడ్ ఇటీవల శ్రీలంక పర్యటనలో రెండు వన్డేలు ఆడి 101 పరుగులు చేశాడు. వన్డే జట్టులో ఆర్యవీర్, అన్వయ్‌తో పాటు మనల్ చౌహాన్, చిగురుపాటి వెంకటకు చోటు లభించింది. సాగర్ విర్క్, అన్మోల్‌జీత్ సింగ్, ఇషాన్ సూద్ వన్డే జట్టులో లేరు.

# టీ20లో గోల్డెన్ హ్యాట్రిక్.. తొలి మూడు బంతులకు మూడు వికెట్లు

- తొలి 3 బంతుల్లోనే 3 వికెట్లతో గోల్డెన్ హాట్రిక్
- ముగ్గురు బ్యాటర్లు డకౌట్
- దీబన్ లింగేశ్ టీఎన్‌పీఎల్‌లో చరిత్ర
- 99 పరుగులకే ట్రిచీ గ్రాండ్ చోళాస్ ఆలౌట్
- ఫైనల్లో తిరుప్పూర్ తమిళన్స్-మదురై పాంథర్స్ ఢీ



**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడు ప్రీమియర్ లీగ్ (టీఎన్‌పీఎల్)లో బుధవారం అద్భుతం చోటుచేసుకుంది. కేవలం మూడు బంతుల్లోనే మూడు వికెట్లు పడిపోయాయి. పైగా ముగ్గురు బ్యాటర్లు ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరారు. కోవై కింగ్స్‌తో క్వాలిఫయర్-2లో ట్రిచీ గ్రాండ్ చోళాస్ బ్యాటింగ్‌లో ఈ షాకింగ్ ఘటన జరిగింది. 184 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ట్రిచీకి కె. దీబన్ లింగేశ్ తొలి ఓవర్లోనే చుక్కలు చూపించాడు. మొదటి మూడు బంతుల్లోనే కె. రాజ్‌కుమార్, ఎస్. శ్యామ్ సుందర్, జగన్నాథన్ కౌశిక్‌లను ఔట్ చేశాడు. ముగ్గురూ డకౌట్ కావడంతో ట్రిచీ ఆరంభంలోనే కుప్పకూలింది. ఈ ప్రదర్శనతో దీబన్ లింగేశ్ టీఎన్‌పీఎల్ చరిత్రలో అరుదైన రికార్డు సృష్టించాడు. లీగ్‌లో గోల్డెన్ హ్యాట్రిక్ సాధించిన తొలి బౌలర్‌గా నిలిచాడు. అంటే వరుసగా మూడు బంతుల్లో మూడు వికెట్లు తీయడంతో పాటు, ఆ ముగ్గురు బ్యాటర్లు కూడా సున్నాకే వెనుదిరిగారు. ట్రిచీ ఇన్నింగ్స్‌లో మరో రెండు డకౌట్లు కూడా నమోదయ్యాయి. మణిమారన్ సిద్ధార్థ్ జాఫర్ జమాల్‌ను ఔట్ చేశాడు.

ఆ తర్వాత ఆర్. దివాకర్ అథిసయరాజ్ డేవిడ్‌సన్‌ను పెవిలియన్‌కు పంపాడు. చివరికి ట్రిచీ 99 పరుగులకే ఆలౌటైంది. సిద్ధార్థ్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో ఐడ్రీమ్ తిరుప్పూర్ తమిళన్స్ టీఎన్‌పీఎల్ 2026 ఫైనల్‌కు చేరింది. ఆగస్టు 28న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో మదురై పాంథర్స్‌తో టైటిల్ పోరులో తలపడనుంది.

# ఇమేజ్ ను పక్కనబెడితే కనక వర్షమే!

ఒకప్పుడు సినిమా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించాలంటే భారీ బడ్జెట్లు, వందల కోట్ల వ్యయంతో కూడిన విజువల్ ఎఫెక్ట్స్, స్టార్ హీరోల ఇమేజ్ మాత్రమే సరిపోతాయని భావించేవారు. కానీ కాలం మారుతున్న కొద్దీ ప్రేక్షకుల అభిరు చి కూడా మారుతోంది. ప్రస్తుతం ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడానికి భారీ హంగులు మాత్రమే సరిపోవని, తెరపై కనిపించే కథలో బలం ఉండాలని చిత్ర పరిశ్రమ స్పష్టంగా గ్రహిస్తోంది. ఈ కొత్త ట్రెండ్‌కు నిదర్శనంగా ఇటీవలి కాలంలో వచ్చిన అనేక సినిమాలు నిలుస్తున్నాయి. స్టార్ ఇమేజ్‌ను నమ్ముకోకుండా విభిన్నమైన కథాంశాలతో వస్తోన్న చిత్రాలకు బాక్సాఫీస్ వద్ద భారీ ఆదరణ లభిస్తోంది.



సమంత ప్రధాన పాత్రలో రిలీజ్ అయిన -మా ఇంటి



బంగారం-, అఖిల్ అక్కినేని నటించి -లెనిన్-, మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన -కొరియన్ కనకరాజు-, మాస్ మహారాజా రవితేజ తాజా చిత్రం -ఇరుముడి- వంటి ప్రాజెక్ట్‌లు కొత్త కోణానికి అద్దం పడుతున్నాయి. ఈ చిత్రాలన్నీ సాధారణ ఇమేజ్ హంగులకు దూరంగా పూర్తిగా కంటెంట్ ... పాత్రల చుట్టూ తిరిగే కథాంశాలతో రూపుదిద్దుకున్నాయి. స్టార్ హీరోల ఇమేజ్, భారీ మార్కెట్ సమీకరణాలను పక్కన పెట్టి దర్శకుని విజన్‌ను నమ్మి చేసిన చిత్రాలివి. ప్రేక్షకులు కూడా రొటీన్ కమర్షియల్ ఫార్ములాను పక్కన పెట్టి కొత్తదనం ఉన్న కథలను ఎప్పుడూ ఆదరిస్తారని ఈ చిత్రాల ఫలితాలో మరోసారి నిరూపితమవుతోంది. ఇతర భాషల ప్రేక్షకులు సైతం బలమైన కంటెంట్ ఉన్న తెలుగు చిత్రాలకు బ్రహ్మరథం పడుతున్నారని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. భాషా భేదాలతో సంబంధం లేకుండా ఎమోషనల్ కనెక్ట్ ఉన్న సినిమాలను గ్లోబల్ ఆడియన్స్ రిసీవ్ చేసుకుంటున్న తీరు అద్భుతంగా ఉంది. దీంతో నిర్మాతలు కూడా భారీ బడ్జెట్ రిస్కుల కంటే కంటెంట్ బేస్డ్ సినిమాల వైపు మొగ్గు చూపడానికి ఆసక్తిగా ఉన్నారు. ఇది తెలుగు పరిశ్రమ పరిధిని మరింత విస్తృతం చేస్తోంది. నటీనటులు కూడా రెగ్యులర్ ఇమేజ్ ట్రాప్ నుంచి బయటపడి విలక్షణమైన పాత్రలు చేయడానికి ఈ ట్రెండ్ ఎంతగానో దోహదపడుతోంది. ప్రయోగాత్మక చిత్రాలు సైతం కమర్షియల్‌గా మంచి విజయాలను నమోదు చేయొచ్చు ని నిరూపితమవుతుండటంతో దర్శక నిర్మాతల్లో కొత్త ఉత్సాహం వెల్లువెత్తుతోంది. భవిష్యత్ లో కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాల హవా మరింత ఎక్కువగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తానికి ఇమేజ్ కంటే కంటెంటే రాజు అనే నిజాన్ని టాలీవుడ్ మరోసారి బలంగా చాటి చెబుతోంది. భారీ బడ్జెట్ల ప్రయోగాలు విఫలమైన చోట బలమైన కథాంశాలు బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఈ సరికొత్త ధోరణి ఇండియన్ సినిమా స్థాయిని మరింత పెంచి భవిష్యత్తులో మరిన్ని గొప్ప చిత్రాలు రావడానికి బాటలు వేస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు.



మృణాల్ ఠాకూర్ ఆకర్షణీయమైన ఎరుపు రంగు క్రాప్ టాప్ మరియు గులాబీ రంగు స్కర్ట్‌లో

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965